సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 28.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 186
పేజీలు: 12 వెల: రూ. 5

మే రెండో వారంలో
# తెలంగాణకు ప్రధాని
## పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సభకు ఏర్పాట్లు

- సికింద్రాబాద్ వేదికగా కేంద్ర పథకాల శుభారంభం
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నుంచి గిరిజన యూనివర్సిటీ వరకు
- కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన
- బీబీనగర్ ఎయిమ్స్ హాస్టల్ ప్రారంభం
- టెక్స్‌టైల్ పార్క్, గ్రీన్‌ఫీల్డ్ హైవేకు శ్రీకారం
- ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి టూర్

10



## పెరిగిన మద్యం అమ్మకాలు
### ఏడాదిగా ఎక్సైజ్ ఆదాయం రికార్డు స్థాయికి



- లిక్కర్ పెరుగుదల..
- బీరు అమ్మకాల్లో పడిపోయిన గ్రాఫ్
- రూ.40,209 కోట్లకు చేరిన అమ్మకం
- షాపులు, బార్ల ద్వారా భారీగా ప్రభుత్వానికి ఆదాయం
- ప్రతి ఏటా పెరుగుతున్న కలెక్షన్లు

09

## రాజ్యసభలో పెరిగిన బలం



### బీజేపీ ఎంపీల సంఖ్య 106 నుంచి 113కు

- పెద్దల సభలో కమలానికి తిరుగులేదు
- ఆప్ సభ్యుల సంఖ్య 10 నుంచి 3కు తగ్గుదల

10

## అజహర్ సేఫ్..
### అవుట్ నుంచి సేఫ్ గేమ్‌కు..

- ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణం
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు

02



## ఇందిరమ్మ ఇళ్లపై సర్కార్ స్పెషల్ ఫోకస్
### జూన్ నాటికి లక్ష ఇళ్ల గృహప్రవేశాలపై సర్కార్ దృష్టి



- జిల్లాల వారీగా సమీక్షలు.. సమస్యల పరిష్కారానికి చర్యలు
- పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు గ్రీన్ సిగ్నల్
- అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుకు ప్రణాళిక
- అర్హుల జాబితా రీ-వెరిఫికేషన్.. లబ్ధిదారులకు న్యాయం

10

## పార్లమెంట్ తరహాలో శాసనసభ
### సభ్యుల కోసం సెంట్రల్ హాల్, మెంబర్స్ క్లబ్



- శాసనసభ ప్రాంగణం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం
- సభ్యుల గౌరవం, ప్రైవసీ పెంపుపై కీలక సూచనలు
- వచ్చే సమావేశాల నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం చేయాలని ఆదేశం

10

# కేసీఆర్ సర్జికల్ స్ట్రైక్

బీఆర్ఎస్ ప్రక్షాళనకు కేసీఆర్ శ్రీకారం


- కేటీఆర్‌కు కీలక బాధ్యతలు!
- గ్రామ స్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణం..
- కేడర్‌కు కొత్త ఊపు ఇవ్వాలన్న అధినేత వ్యూహం
- సభ్యత్వ నమోదుకు ఆదేశం!
- శిక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ సరికొత్త వ్యూహం!
- ఎన్నికల దృష్ట్యా బీఆర్ఎస్‌లో కీలక మార్పులు

రాష్ట్ర స్థాయి మినహా అన్ని కమిటీల రద్దు

**ముద్ర డెస్క్ :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ పునర్వ్యవస్థీకరణ అంశం హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం, పార్టీ భవిష్యత్తు దిశానిర్దేశం చేసేలా పలు సంచలన నిర్ణయాలకు వేదికైంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేసే ఉద్దేశంతో కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

**పార్టీ ప్రక్షాళన.. అన్ని స్థాయిల కమిటీల రద్దు**

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం పార్టీ కమిటీల రద్దు. రాష్ట్ర స్థాయి కమిటీ మినహా, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అన్ని అనుబంధ కమిటీలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. గత ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ నిర్మాణంలో లోపాలను గుర్తించిన అధినేత, పార్టీని మళ్లీ మొదటి నుంచి నిర్మించాలని మిగతా 02లో





## ఈసారి ముఖాలు చూసి టికెటివ్వం
### పార్టీ శ్రేణులకు గులాబీ దళపతి కేసీఆర్ దిశా నిర్దేశం



- 60 లక్షల సభ్యత్వాలు ఉన్నా ఎలా ఓడిపోయాం
- నేతలందరూ క్షేత్రస్థాయిలో పోరాటాలకు సిద్ధమవ్వాలి
- తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీపడలేదు
- హైదరాబాద్ కోసం సోనియాతో పోరాటం
- బీజేపీ ఎంపీ తేజస్వ సూర్య ఓ వెధవ

02

జై తెలంగాణ నినాదం కోసమే నాడు బాబుతో పొత్తు




తెలంగాణపై కమలం
# మాస్టర్ ప్లాన్
## బెంగాల్.. తర్వాత పూర్తి ఫోకస్ తెలంగాణపైనే
### తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కమలం అడుగులు

- ఆపరేషన్ కమలం మళ్లీ యాక్టివ్
- ఇతర పార్టీల నేతలపై బీజేపీ కన్ను
- చేరికలతో బలం పెంచుకునే వ్యూహం
- అవసరమైతే కలిసి వచ్చే పార్టీలతో కూటమి
- క్షేత్రస్థాయిలో బూత్ బలోపేతంపై ఫోకస్
- త్రిముఖ పోటీలో బీజేపీ కొత్త గేమ్ ప్లాన్
- బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై బీజేపీ లెక్కలు
- వచ్చే ఎన్నికల కోసం వేగంగా ఎత్తుగడలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అన్ని పార్టీలు తెలంగాణ వైపే చూస్తున్నాయి. ఇక్కడున్న పార్టీలు కూడా ఒక దాని నుంచి మరోకటి పుట్టుకొస్తున్నాయి. తాజాగా ఒకవైపు అధికార కాంగ్రెస్ తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తుంటే, బీఆర్ఎస్ పూర్వ వైభవాన్ని తెచ్చుకునేందుకు శక్తి కూడదీసుకుంటోంది. మరోవైపు కవిత కొత్త పార్టీ ప్రకటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో, రాజకీయ వర్గాల్లో కొత్త సంచలనం మొదలైంది. ఈ పరిణామాల మధ్య నిశ్శబ్దంగా ఉన్నట్లు కనిపిస్తున్న భారతీయ జనతా పార్టీ, తెర వెనుక తనదైన శైలిలో భారీ వ్యూహరచన చేస్తోంది. కర్ణాటక తర్వాత దక్షిణాదిలో అధికారం చేపట్టేందుకు మిగతా 02లో

# బీఆర్ఎస్ ఒక శవం
## మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ వ్యాఖ్యలు
### అది క్లోజైన చాప్టర్.. ఉన్న పార్టీకే దిక్కులేదు..
### కవిత కొత్త పార్టీ గురించి ఆలోచించడం దండగ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ చాప్టర్ ముగిసిపోయిందని, ఆ పార్టీకి ఇక భవిష్యత్తు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన సందర్భంలో కీలక వ్యాఖ్యలు చేశారు. చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా అది తిరిగి లేచి వస్తుందా? బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉందని తేల్చారు. కవిత పెట్టిన పార్టీపైనా స్పందించారు. కొత్త పార్టీల గురించి ఆలోచించేకంటే, ఉన్న పార్టీయే ఉంటుందో ఊడుతుందో చూసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజలు ఎంతో ఆకాంక్షతో అధికారం ఇస్తే, కేసీఆర్ కుటుంబం అహంకారంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, అందుకే ప్రజలు వారికి ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చి పంపించారని మండిపడ్డారు.

**కుటుంబ ప్రయోజనాల కోసమే తాపత్రయం**

బీఆర్ఎస్ ఇప్పుడు కేవలం ఒక కుటుంబం కోసమే పనిచేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ కుటుంబంతో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయని, ఇప్పుడు ఆ ఇంట్లో జరుగుతున్న పంపకాల పంచాయతీ వల్లే అనుబంధ సంస్థలు, కొత్త రాజకీయ సమీకరణలు పుట్టుకొస్తున్నాయని వ్యాఖ్యానించారు. మిగతా 02లో



ఇదీ AI ముద్ర




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.04.2026
www.mudranews.in | @mudranews



### నేరేడు పండ్లు



రోజుకు పరిమితంగా తినండి రోజుకు 8-10 నేరేడు పండ్లు తింటే శరీరానికి సరిపడా పోషకాలు అందుతాయి.




## తెలంగాణపై కమలం

# 'మాస్టర్ ప్లాన్'

(మొదటి పేజీ తరువాయి)

అనువైన రాష్ట్రంగా తెలంగాణను గుర్తించిన బీజేపీ, రాబోయే ఆరు నెలల్లో తన అసలైన రాజకీయ చదరంగాన్ని ప్రారంభించబోతోందన్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

**నాయకత్వ లేమి – బీజేపీ ప్రధాన సవాల్**

తెలంగాణలో బీజేపీకి ఉన్న ప్రధాన సమస్య రాష్ట్రవ్యాప్త క్రేజ్ నియోజకవర్గ స్థాయి ఓట్లుగా మారకపోవడం. ప్రధాని మోదీ ప్రభావం, జాతీయ అంశాలతో రాష్ట్ర స్థాయిలో పార్టీకి ఆదరణ పెరుగుతున్నా, క్షేత్రస్థాయిలో గెలిచే గుర్రాలు లేకపోవడం పార్టీని దశాబ్దాలుగా వేధిస్తోంది. బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ, ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను ఢీకొట్టే స్థాయి నాయకత్వం ప్రతి నియోజకవర్గంలో లేకపోవడం బీజేపీకి పెద్ద లోటు. ఈ ఖాళీని పూరించడానికి పార్టీ ఇప్పుడు ఆర్గానిక్ గ్రోత్ కంటే ఇన్‌స్టంట్ ఇంపోర్ట్ వైపే మొగ్గు చూపుతోంది.

**ఆపరేషన్ ఆకర్ష్ - మలి విడత వ్యూహం**


ప్రస్తుత రాజకీయ శూన్యతను వాడుకుని, ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలను చేర్చుకోవడమే లక్ష్యంగా బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్ ను మళ్లీ పట్టాలెక్కించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మల్లారెడ్డి వంటి నేతలు బీజేపీ అగ్రనేతలతో టచ్‌లో ఉన్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. కేవలం ఒకరిద్దరు కాదు, దాదాపు 20 నుండి 30 మంది కీలక నియోజకవర్గ స్థాయి నేతలతో ఢిల్లీ స్థాయిలోనే సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వస్తేనే తమ రాజకీయ భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్న ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఇప్పుడు కమలం గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు.

**త్రిముఖ పోటీలో బీజేపీ అడుగులు**

కవిత కొత్త పార్టీ పెడితే బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చీలిపోయే అవకాశం ఉంది. ఇది బీజేపీకి పరోక్షంగా లాభం చేకూరుస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకోవడానికి, బీజేపీ ఇప్పుడు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి బలోపేతంపై దృష్టి సారించింది. గత ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకుని తన బలాన్ని నిరూపించుకున్న బీజేపీ, ఈసారి ఆ సంఖ్యను మ్యాజిక్ ఫిగర్‌కు చేర్చాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం స్థానిక నాయకత్వ సమస్యను చేరికల ద్వారా పరిష్కరించుకుని సత్తా చాటాలని భావిస్తోంది.తెలంగాణలో ఇప్పుడు కనిపిస్తున్న నిశ్శబ్దం ఒక తుపానుకు ముందు వచ్చే ప్రశాంతత లాంటిదే. కాంగ్రెస్ అధికార బలం, కవిత కొత్త పార్టీ ప్రయోగాలు, బీఆర్ఎస్ ఉనికి కోసం పోరాటం.. ఈ మూడింటి మధ్య బీజేపీ వేస్తున్న అడుగులు తెలంగాణ రాజకీయాలను రాబోయే రోజుల్లో ఏ దిశగా మారుస్తాయో చూడాలి.

**కలుపుకు వెళ్లే వ్యూహం**

నిజంగానే తెలంగాణలో బీజేపీకి అనుకూలత ఉంటే.. ఇతర పార్టీలను కలుపుకుని పోయేందుకు కూడా సిద్ధమే అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్.. బీజేపీ కలిసి పోటీ చేస్తాయనే ఊహాగానాలు వస్తున్నాయి. రెండు పార్టీలు ఈ ప్రచారాన్ని కొట్టివేస్తున్నా.. బీఆర్ఎస్ లో మాత్రం స్వయంగా కేసీఆర్ కూతురు కవిత దాన్ని వ్యతిరేకించి అక్కడి నుంచి బయటకు వచ్చారు. దీనికి తోడు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసే అంశాలపై చర్చలు కూడా జరుగుతున్నట్లు హస్తినలో ప్రచారం. ఏపీలో జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పాటూ జగన్ పై విజయం సాధించినట్లుగా తెలంగాణలో కూడా అలాంటి వ్యూహమే రచిస్తున్నట్లు తెలుస్తోంది.



# కేసీఆర్ సర్జికల్ స్ట్రైక్

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. ఈ నిర్ణ యం ద్వారా నిష్క్రియాత్మకంగా ఉన్న కమిటీలను తొలగించి.. చురుకైన కార్యకర్తలకు చోటు కల్పించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టమవుతోంది.

**సభ్యత్వ నమోదు..**
**కేడర్‌లో నూతనోత్సాహం**

పార్టీ బలాన్ని అంచనా వేయడానికి.. విస్తరించడానికి సభ్యత్వ నమోదు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని కేసీఆర్ ఆదేశించారు. "పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. ప్రతి గ్రామంలోనూ పార్టీ జెండా ఎగిరేలా ప్రతి ఇంటికీ బీఆర్ఎస్ చేరువయ్యేలా సభ్యత్వ నమోదు జరగాలి" అని ఆయన కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈసారి సభ్యత్వ నమోదులో సాంకేతికతను విరివిగా ఉపయోగించబోతున్నట్లు సమాచారం. దీనివల్ల కార్యకర్తల డేటాబేస్ పక్కాగా ఉంటుందని పార్టీ భావిస్తోంది. రాజకీయ విశ్లేషకుల ప్రకారం.. కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక లోతైన వ్యూహం ఉంది.. ఎన్నికల తర్వాత కేడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తొలగించి, వారిని మళ్లీ యాక్టివ్ చేయడం. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీని ఒక బలమైన శక్తిగా నిలబెట్టడం... కేటీఆర్‌కు శిక్షణ బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీపై ఆయన పట్టును మరింత పెంచడం ధ్యేయంగా కనిపిస్తోంది..

మొత్తానికి కేసీఆర్ తీసుకున్న ఈ "సర్జికల్ స్ట్రైక్" వంటి నిర్ణయాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్త ఊపిరి పోస్తాయని శ్రేణులు భావిస్తున్నాయి. కమిటీల రద్దు, కొత్త నాయకత్వానికి శిక్షణ, భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ మళ్లీ తన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది.కొత్త కమిటీల నియామకం ఎలా ఉండబోతుందోనన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది.

**కేటీఆర్‌కు కీలక బాధ్యతలు.. శిక్షణే లక్ష్యం**

కొత్త కమిటీల నియామకం.. వాటికి అవసరమైన దిశానిర్దేశం చేసే బాధ్యతను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు (కేటీఆర్)కు అప్పగించారు. కేవలం కమిటీలను వేయ డమే కాకుండా కొత్తగా ఎన్నికయ్యే నాయకులకు పార్టీ సిద్ధాంతాలు.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు.. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టే విధానాలపై ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వాలని కేసీఆర్ సూచించారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం.. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించడం.. ప్రజల్లోకి పార్టీ భావజాలాన్ని బలంగా తీసుకెళ్లడం.. ఈ మూడు అంశాలే ప్రాతిపదికగా కేటీఆర్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించనున్నారు.

# అజహార్ సేఫ్..

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పదవి ఊడుతుందా.. ఉంటుందా.. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతారా.. మధ్యలోనే ఔటై వెళ్తారా అనే అనుమానాలకు తెర పడింది. ఎట్టకేలకు అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎంపికైన ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిద్దరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరై నూతన ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు. అంతకు ముందు, ఆదివారం నాడు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు వీరి నియామకానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.

**మైనార్టీల సంక్షేమమే నా లక్ష్యం: ఎమ్మెల్సీ అజారుద్దీన్**

ప్రమాణస్వీకారం అనంతరం మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి మండలికి, టీపీసీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి అభివృద్ధి కోసం తాను మరింత నిబద్ధతతో కృషి చేస్తానన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, మైనార్టీల సంక్షేమంపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి వల్లే తనకు ఈ అవకాశం లభించిందని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఎత్తుపల్లాలను అధిగమిస్తూ ప్రజాసేవలో ముందుంటానని అజారుద్దీన్ స్పష్టం చేశారు.





**ప్రజలకు అందుబాటులో ఉంటా : కోదండరాం**

ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కోదండరాం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో తాను భాగమై, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు.

**అజారుద్దీన్ మంత్రి పదవి సేఫ్..**

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. గవర్నర్ కోటా కింద పెండింగ్‌లో ఉన్న 2 ఎమ్మెల్సీ పదవుల నియామక ఫైల్‌పై గవర్నర్ శివ్‌ప్రతాప్ సంతకం చేయడంతో మంత్రి అజారుద్దీన్ పదవీ గండం నుంచి గట్టెక్కారు. గతేడాది ఆగస్టు 30న ప్రొఫెసర్ కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన అప్పటి నుండి రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామం మంత్రి అజారుద్దీన్‌కు కీలకంగా మారింది. శాసన సభ లేదా శాసన మండలిలో సభ్యత్వం లేకుండానే ఆయనను రాష్ట్ర ప్రభుత్వం మంత్రిగా ప్రమాణం చేయించింది. నిబంధనల ప్రకారం 6 నెలల గడువులోగా ఏదైనా సభలో సభ్యుడిగా ఎన్నికవ్వాల్సి ఉండగా, ఆ గడువు ముగిసే సరిగ్గా కొన్ని రోజుల ముందు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులకు ఆమోదం తెలపడం ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్ నిర్ణయంతో అటు ప్రభుత్వం, ఇటు అజారుద్దీన్‌కు ఊరట లభించిం ది. దీంతో మంత్రి పదవికి అడ్డంకులు తొలగిపోయాయి.



## హైదరాబాద్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**ముద్ర డెస్క్:**

హైదరాబాద్‌లో అపోలో ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 46 ఏళ్ల క్రితం చెన్నైలో అపోలో తొలి ఆసుపత్రిని ప్రారంభించిన ప్రతాప్ సీ. రెడ్డి అనేక ఆస్పత్రుల స్థాపనకు మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. “అపోలో” అనే పేరు కోట్లాది ప్రజలకు గుండె ధైర్యమని, సమాజానికి ఆదర్శంగా నిలిచిన అపోలో యాజమాన్యాన్ని అభినందిస్తున్నామని అన్నారు.

హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్గా అభివృద్ధి చేస్తున్నామని, మధ్యప్రాచ్య దేశాల నుంచి రోగులు సులభంగా చేరుకునేలా డైరెక్ట్ విమానాల కోసం కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో “హెల్త్ సిటీ”ని నాలుగో నగరంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గ్రీన్ ఛానల్ ద్వారా ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా ఆసుపత్రికి తరలించే విధానంపై ఎయిర్‌పోర్ట్ అథారిటీలతో చర్చలు కొనసాగుతున్నాయి.

కోవిడ్ వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఉత్పత్తి కావడం గర్వకారణమని, దేశంలో సుమారు 40% బల్క్ డ్రగ్స్ ఇక్కడే తయారవుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహను “సోషియల్ డాక్టర్”గా అభివర్ణించారు.

పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తామని, భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన సీఎం– “తెలంగాణ అంటే వ్యాపారం... రండి, పెట్టుబడులు పెట్టండి” అని.

## ఈ సారి ముఖాలు చూసి

# టికెటిచ్చేది లేదు

**ముద్ర , తెలంగాణ బ్యూరో :**

ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ తప్ప మిగతా అన్ని కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్టు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ల విషయంలో కఠినంగా ఉంటామని, ముఖాలు చూసి కాకుండా పనితీరు ఆధారంగా నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీకి 60 లక్షల సభ్యత్వాలు ఉన్నా ఎందుకు ఓడిపోయామో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించిన కేసీఆర్, ఇకపై “రాశి కంటే వాసి” ముఖ్యమన్నారు. సభ్యత్వ నమోదు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేపట్టి సాధారణ సభ్యత్వం రూ. 10, క్రియాశీల సభ్యత్వం రూ. 50గా నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన, రైతుల పరిస్థితి దారుణంగా మారిందని, ధాన్యం కొనుగోలు కూడా సరిగా చేయలేకపోతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం తానేనాడు రాజీ పడలేదని, హైదరాబాద్ విషయంలో అప్పట్లో సోనియా గాంధీ ఒత్తిడికి లొంగలేదని చెప్పారు. 2009లో టీడీపీతో పొత్తు కూడా వ్యూహాత్మకమేనని, “జై తెలంగాణ” నినాదం కోసం ఆ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. బీజేపీ నేత తేజస్వి సూర్య వ్యాఖ్యలపై మండిపడిన కేసీఆర్, అప్పట్లో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే లోక్‌సభలో గట్టిగా ప్రతిస్పందించేవారమన్నారు. రైతు బంధు పథకం తన కాలంలో నిపుణుల సలహాతో ప్రారంభించామని, ప్రస్తుతం వ్యవసాయం క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కొనుగోలు పూర్తిగా చేపట్టాలని బీఆర్ఎస్ తీర్మానం చేసింది. నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఇక సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పిస్తూ, కాంగ్రెస్ ముందుగా తమ పరిస్థితిని చూసుకోవాలని అన్నారు. ఓటర్ల జాబితా (సర్) సవరణపై పార్టీ ఫోకస్ పెట్టిందని, అన్ని నియోజకవర్గాల్లో బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం జరుగుతోందని తెలిపారు.

# బీఆర్ఎస్ ఒక శవం

(మొదటి పేజీ తరువాయి)

వారసత్వ సంపద కోసం, అధికారం కోసం ఆ కుటుంబ సభ్యులే ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే తన కొడుకు కేటీఆర్‌ను సీఎం చేయాలని ప్రయత్నించారని, ఇదంతా కేవలం వారి కుటుంబ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.

**కేసీఆర్ శత్రువు కాదు..**
**కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమే**

చనిపోవాలని కోరుకుంటున్నట్లుగా కేసీఆర్ చేసిన విమర్శలను కూడా రేవంత్ రెడ్డి ఖండించారు. కేసీఆర్ నాకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమే, శత్రువు కాదు. ఆయన ఆరోగ్యం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నది నేనే. ఆయన్ని స్వయంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాను అని గుర్తు చేశారు. ఆయనకు చెడు జరగాలని కోరుకోవాల్సిన అవసరం తనకు లేదని, ఇప్పటికే తాను విజయం సాధించి అధికారంలో ఉన్నానని చెప్పారు. అయితే, కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటారేమో అని రేవంత్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు.

**ముగిసిన బీఆర్ఎస్ అధ్యాయం**

తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా సాగిన బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని సీఎం పేర్కొన్నారు. పదేళ్ల అహంకార పూరిత పాలనకు జనం చరమగీతం పాడారని, ఇప్పుడు ఆ పార్టీని బతికించేందుకు ఎంత ప్రయత్నం చేసినా లాభం లేదని విశ్లేషించారు. రాజకీయంగా తమ పని అయిపోయిందని తెలిసే, ఇప్పుడు మనుగడ కోసం రకరకాల వేషాలు వేస్తున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మొత్తం మీద బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకమైందని ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.



## యుద్ధంతో అమెరికా అర్థిక వ్యవస్థ తలకిందులు!

**ముద్ర డెస్క్:**

ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడులు చేపట్టిన తర్వాత, ఈ యుద్ధం ప్రస్తుతం కాల్పుల విరమణ దశలో ఉంది. ఇరాన్ ప్రతీకారంగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా స్థావరాలు, కమాండ్ సెంటర్లు, విమాన నిల్వాలు, రాడార్‌లపై దాడి చేసింది. అమెరికా తన అధునాతన గగన రక్షణ వ్యవస్థలను ప్రదర్శించినా, ఇరాన్ పాత ఎఫ్–5 విమానాలతో ఆశ్చర్యకరంగా పోరాడింది. రెండు వైపులా నష్టాలు తీవ్రంగా ఉన్నప్పటికీ, యుద్ధం ఆగుతుందా, చర్చలు జరుగుతాయా అనేవి స్పష్టత లేకుండా ఉన్నాయి.

అమెరికా ఇరాన్ సైనిక శక్తిని బలహీనపరిచామని ప్రకటించినా, అంతర్జాతీయ మీడియా ఇరాన్ అమెరికాకు గట్టి దెబ్బ తీసినట్లు కథనాలు ప్రచురించాయి. యూఎస్ నష్టాల కచ్చితమైన అంకెలు బయటపడలేదు, దీనిపై ట్రంప్ పరిపాలనకు సొంత పార్టీ నేతలు కూడా అసంతృప్తి తెలిపారు. ఇరాన్ దాడులు అమెరికా రక్షణ వ్యవస్థలను పరీక్షించాయి, రెండు వైపులా పునర్నిర్మాణ ఖర్చులు భారీగా పెరిగాయి. యుద్ధం మొదటి వారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది, పెంటగాన్ 200 బిలియన్ డాలర్లకు పైగా అదనపు నిధులు కోరింది. ట్రంప్ ప్రతిపాదించిన 1.5 ట్రిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్ మునుపటి సంవత్సరానికి 50 శాతం ఎక్కువ. దెబ్బతిన్న స్థావరాల మరమ్మత్తుకు మరో అనేక బిలియన్ల అవసరం, ఇది ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది. ఈ ఖర్చులు యుద్ధాన్ని ఆపడానికి ఒత్తిడి తీసుకొస్తాయా అనేది చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### నేరేడు పండ్లు : ఖాళీ కడుపుతో తినొద్దు

అల్పాహారం తర్వాత లేదా భోజనం తరువాత తింటే జీర్ణక్రియకు మంచిది.





## కాళీయమర్దన అలంకార సేవలో యాదగిరి నారసింహుడు

**ముద్ర, యాదగిరిగుట్ట :**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం ఉదయం ప్రధాన ఆలయ మంటపంలో స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారిని యాగశాల ప్రవేశం చేసి ద్వారా తోరణ పూజ మూర్తి కుంభారాధన చతు స్థానార్చన నృసింహ లక్ష్మీ సుదర్శన శతకం గరుడ మూల మంత్రం హోమములు నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి కాళీయ మర్దన అలంకార సేవను నిర్వహించి ఆలయ తిరు మాడవీధుల్లో ఊరేగుతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం యాగశాలలో సాయ మారాధన నిత్య హవనము లక్ష్మీ నృసింహ సుదర్శన మూల హోమములు నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్ ఆలయ చైర్మన్ నరసింహమూర్తి ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు అర్చకులు సందీప్ కుమార్ చార్యులు అరుణ్ కుమార్ చార్యులు ఏఈఓ శంకర్ నాయక్ ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు దేవస్థాన సిబ్బంది కుమార్ సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

## "రేవంత్ పోవాలి కేసీఆర్ రావాలి"

- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

**ముద్ర, హైదరాబాద్ :**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు బీఆర్ఎస్ పాత్రను గుర్తుచేసిన ఆయన, నాలుగు కోట్ల ప్రజల ఆశయాలను నెరవేర్చిన పార్టీగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమం తగ్గిపోయి, అభివృద్ధి ఆగిపోయిందని విమర్శించిన హరీశ్ రావు, ప్రజల్లో “రేవంత్ పోవాలి... కేసీఆర్ రావాలి” అనే నినాదం మార్మోగుతోందన్నారు. ఎప్పటికీ ప్రజల పక్షానే నిలబడే పార్టీ బీఆర్ఎస్ అని, గులాబీ జెండా మళ్లీ ఎగిరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయి

- కవిత పార్టీపై కేటీఆర్ సెటైర్



**ముద్ర డెస్క్:**

కవిత ‘టీఆర్ఎస్’ పేరుతో పెట్టిన కొత్త పార్టీపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి.. పోతుంటాయని ఎద్దేవా చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువ అని పేర్కొన్నారు. కొత్త పార్టీని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ గురించి చాలా మంది మాట్లాడుతున్నారని.. వాటిని కూడా పట్టించుకోనక్కర్లేదని చెప్పారు.

## భర్త చెల్లినే.. రెండో భార్యగా చూపించి విడాకులు



**ముద్ర డెస్క్:**

విడాకులు పొందేందుకు ఓ మహిళ వ్యవహరించిన తీరు షాక్‌కు గురిచేస్తోంది . ఎవరూ ఊహించని రీతిలో తన ఆడపడుచునే భర్తకు రెండో భార్యగా చూపి, ఏకపక్షంగా విడాకులు పొందింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో భర్త మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గ్వాలియర్‌కు చెందిన ఓ మహిళ 1998లో మార్కెటింగ్ కంపెనీలో పనిచేసే వ్యక్తిని వివాహం చేసుకుంది. అతడు వృత్తిరీత్యా తరచూ ఇంటికి దూరంగా ఉండాల్సి వచ్చేది. అదే దంపతుల మధ్య గొడవలకు కారణమైంది. గొడవలు తీవ్రరూపం దాల్చడంతో ఆమె 2015 నుంచి వేరుగా జీవిస్తోంది. అలాగే విడాకులు కావాలని ఎన్నిసార్లు అడిగినా.. అతడు మాత్రం నిరాకరించేవాడు. ఎట్టిపరిస్థితుల్లోను విడాకులు పొందాలని నిర్ణయించుకున్న ఆమె.. 2021లో గ్వాలియర్‌లోని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన భర్త మళ్లీ పెళ్లి చేసుకున్నాడని తనకు విడాకులు ఇవ్వాలని కోరింది. ఆ క్రమంలో అతడు తన సోదరి, ఇతర బంధువులతో దిగిన ఫొటోలను కోర్టుకు చూపించింది. అతడు రెండో పెళ్లి చేసుకున్నాడని బుకాయించింది. ఆ ఫొటోను ఆధారంగా పరిగణించిన కోర్టు.. ఆమెకు విడాకులు మంజూరు చేసింది. వాస్తవంగా అతడి పక్కన నిల్చున్నది సొంత సోదరి కావడం గమనార్హం.

తన వాదనను వినిపించే అవకాశం కల్పించలేదని, ఏకపక్షంగా విడాకులు మంజూరుచేశారని భర్త వాపోయాడు. ఏప్రిల్ నెలలో డివోర్స్ డిక్రీ రావడంతో భార్య చూపించిన ఫొటో గురించి అతడికి తెలిసింది. దీంతో వెంటనే మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి తన భార్య తప్పుడు వివరాలు చూపించి పొందిన విడాకుల తీర్పును నిలిపివేయాలని కోరాడు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది.

# ఇందిరమ్మ బాధ్యత కలెక్టర్లదే

- జిల్లా కలెక్టర్లకు మరిన్ని అధికారాలు
- అర్హత ఉంటే చాలు ఇల్లు
- సాదాబైనామాలపై ఆర్డీవోలదే తుది నిర్ణయం
- తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నూతన భవనాలు
- సర్వేతోనే భూవివాదాలకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**ముద్ర, హైదరాబాద్,**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మరింత వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయడానికి అధికార వికేంద్రీకరణ చేసి జిల్లా కలెక్టర్లకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా హౌసింగ్ అధికారులతో ప్రతి వారం సమీక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూడటానికి ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై సోమవారం హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జిల్లాల ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా హౌసింగ్, రెవెన్యూ అంశాలపై లోతైన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు ప్రస్తావించిన అంశాలపై అక్కడికక్కడే స్పందించి తగిన ఆదేశాలు ఇచ్చారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గౌరవ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం నిరంతరం ప్రక్రియ అని అన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోని వారు, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా కూడా అర్హత ఉంటే , ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశాలలో పలువురు ప్రజాప్రతినిధులు ఇచ్చిన సూచనలను, సలహాలను కూడా పరిగణనలోనికి తీసుకుంటామని తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా మరింతగా విస్తృతంగా భాగస్వామ్యులు కావాలన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేశామని, ఆయా లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లను నిర్మించుకునేలా ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకుని 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా జి ప్లస్ వన్ పద్ధతిలో ఇండ్లను నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించామని చెప్పారు.


**వివాదాలకు శాశ్వత పరిష్కారం :**

భూ సర్వేతోనే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలోని ఐదు మండలాలలో ప్రయోగాత్మకంగా సర్వే మ్యాపుతో రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాత సర్వే మ్యాపు నెంబరు, భూ దార్ నెంబరు కేటాయిస్తున్నామని తెలిపారు. సాదా బైనామాలకు సంబంధించి వీలైనంత త్వరగా దరఖాస్తులను పరిష్కరిస్తామని వివరించారు. కొనుగోలుదారుడు ఒక్కడే డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని, ఈ దరఖాస్తుల పరిష్కారం మరింత వేగవంతం చేయడానికి వీలుగా ఆర్డీవోలకే అధికారాలను దఖలు పరిచినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా, తహశీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని తొలివిడతలో శిధిలావస్థకు చేరిన చోట నిర్మిస్తామని పేర్కొన్నారు. అలాగే ప్రతిజిల్లా కేంద్రంలో అత్యాధునిక వసతులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దశాబ్దాల నుంచి రెవెన్యూ, ఫారెస్టు, ఎండోమెంట్, వక్ఫ్ మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయని ఉమ్మడి సర్వే నిర్వహించి ఇటువంటి సమస్యలు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశాల్లో నిజామాబాద్ ఇన్ చార్జ్ మంత్రి సీతక్క, ఆదిలాబాద్ ఇన్ చార్జ్ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, మంత్రి జి.వివేక్, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, ఆయా జిల్లా ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ కార్యదర్శి శ్రీ డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ సెక్రటిరీ శ్రీ విపి గౌతం తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ పలకరింపు..

- ‘తాటి ముంజలు’ ఆస్వాదింపు..
- ఈటల, దత్తన్నల అపూర్వ కలయిక

**ముద్ర, మల్కాజ్ గిరి:**



మండు వేసవి వేళ.. ఒక చల్లని, అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది. మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తాటి ముంజలను ఆస్వాదించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న ఈటల మార్గమధ్యలో తాటి ముంజలు కనిపించగానే వాహనం ఆపారు. తన అనుచరులతో కలిసి ప్రకృతి ప్రసాదించిన ముంజలు తింటూ ఉండగా.. అదే దారిలో వెళ్తున్న సీనియర్ నేత బండారు దత్తాత్రేయ కారు అక్కడ ఆగింది. పాత మిత్రుడు, పెద్దన్న దత్తాత్రేయను చూడగానే ఈటల ఎంతో ఆప్యాయంగా పలకరించారు. "అన్నా.. ముంజలు తిందాం రా... అంటూ ఆహ్వానించిన తీరు అక్కడున్న వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించింది. ఇద్దరు అగ్రనేతలు హోదాలను పక్కన పెట్టి, సామాన్యుల మధ్య రోడ్డు పక్కనే నిలబడి ముంజలను ఆస్వాదించడం విశేషం.

**గౌడన్నల కష్టాలపై ఆరా**

కేవలం ముంజలు తినడమే కాకుండా, అక్కడ విక్రయిస్తున్న గౌడ సోదరులతో ఈటల రాజేందర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సీజన్‌లో వారి వృత్తి ఎలా సాగుతోంది, చెట్లు ఎక్కేటప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులేమిటి, గిరాకీ ఎలా ఉంది అన్న విషయాలను ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు సీనియర్ నాయకులు ఎంతో నిరాడంబరంగా ఒకే చోట కలిసి సమయాన్ని గడపడం శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ఉప ముఖ్యమంత్రి సీపీఆర్ఓ మృతి


**ముద్ర, హైదరాబాద్ :**




ఉపముఖ్యమంత్రి చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ తీవ్రమైన గుండెపోటుతో అపోలో స్పెక్ట్రా ఆసుపత్రిలో మరణించారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థలలో సీనియర్ జర్నలిస్టుగా కీలక బాధ్యతలను గతంలో ఆయన నిర్వహించారు. విధి నిర్వహణలో నికార్సైన పాత్రికేయుడిగా పనిచేశారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం చాతి నొప్పి రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతుండగానే కార్డియాక్ అరెస్టు కావడంతో సమీపంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స నిర్వహిస్తున్న సమయంలో మరోమారు కార్డియాక్ అరెస్ట్ కావడంతో తుది శ్వాస విడిచారు. మారబోయిన మధుసూదన్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యంత నిజాయితీ గల పాత్రికేయన్ని కోల్పోవడం బాధాకరంగా ఉందని ఆయన అన్నారు. వృత్తిపట్ల అత్యంత నిబద్ధత కలిగిన పాత్రికేయుడని ఉపముఖ్యమంత్రి చెప్పారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి ఆత్మస్థైర్యం కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

## సిధా రెడ్డికి అవార్డు రాష్ట్రానికి గర్వకారణం

- ఉస్మానియా తెలుగు శాఖ ఆధ్వర్యంలో నేడు అభినందన సభ





**ముద్ర, హైదరాబాద్:**

తెలుగు సాహిత్య ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రముఖ కవి, రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధా రెడ్డి అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు పరిశోధక విద్యార్థి పల్లె సతీష్ అన్నారు. సిద్దా రెడ్డి 2025 సంవత్సరానికి అనిమేష (ఉపద్రవ గాధ కావ్యం) రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకోవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 28న ఉదయం 10 గంటలకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 121లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ అభినందన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షులు డా.ఏలే విజయలక్ష్మి అధ్యక్షత వహించనుండగా, విశిష్ట అతిథులుగా ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. ఎం. లింగప్ప, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం, తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ప్రొ. సాగి కమలాకర శర్మ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహిత్య అభిమానులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## టీటీడీకి రూ.20 లక్షలు విరాళం



**ముద్ర, తిరుమల:**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్.రామచందర్ రావు కుమార్తె శ్రీమతి ఆముక్త మరియు కుమారుడు శ్రీ అవనీష్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు చెరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ కాదు.. ఒక విప్లవం

- పార్టీ శ్రేణులకు కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**ముద్ర, హైదరాబాద్:**



పార్టీ శ్రేణులకు కేటీఆర్, హరీశ్‌రావులు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పాతికేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ట్వీట్ చేసిన కేటీఆర్, 25 వసంతాల మైలురాయిని అందుకున్న మహోజ్వల లాంగ్ మార్చ్ అని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని, ఒక విప్లవమన్నారు. బీఆర్ఎస్‌తో స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం రెపరెపలాడిందని పేర్కొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
మంగళవారం 28.04.2026
4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# రాబోయే కాలం బ్రహ్మచర్య యుగం..

ఒక ఇటీవలి అంతర్జాతీయ సర్వే ప్రకారం, రాబోయే ఆరు సంవత్సరాలలో ప్రపంచంలోని దాదాపు 45% మంది అమ్మాయిలు అవివాహితులుగానే ఉండిపోతారు. ఈ నివేదిక 1 ఫిబ్రవరి, 2025న లోక్‌మత్ వార్తాపత్రికలో ప్రచురితమైంది. ఇది మోర్గాన్ స్టాన్లీ సంస్థ చేసిన వివరణాత్మక అధ్యయనంపై ఆధారపడింది. చాలా మంది తల్లిదండ్రులు తమ కూతుళ్లకు సంబంధాలు చూస్తున్నారు, కానీ అమ్మాయిలకు మాత్రం వివాహంపై ఆసక్తి లేదు. ఫలితంగా వారు చేస్తున్న ప్రతిపాదన తిరస్కరించబడుతోంది. సమాజంలోని ఒక పెద్ద వర్గం ఇప్పటికీ ఈ మార్పు యొక్క తీవ్రత గురించి తెలియకుండా ఉంది, కాబట్టి మనం సమయానికి అప్రమత్తం కావడం అవసరం. అమ్మాయిల వివాహానికి తగిన వయస్సు 23 నుంచి 26 సంవత్సరాల మధ్య ఉండాలి. సాధ్యమైతే అంతకంటే ముందు ఉంటే ఫర్వాలేదు. దీని కోసం సామూహిక స్థాయిలో అవగాహన, చొరవ అవసరం. ఈ అంశం ఎవరికీ వ్యతిరేకంగా లేవనెత్తలేదు, కానీ భవిష్యత్తు స్థిరత్వం, సమతూల్యత పట్ల ఆందోళనతో లేవనెత్తబడింది. సమాజం, కుటుంబం, వ్యక్తిగత జీవితం మధ్య సమతూల్యతను కాపాడుకోవడమే నిజమైన పురోగతి. పిల్లలు 20 ఏళ్లకు పెళ్లి చేసుకునేటప్పుడు, ఒక శతాబ్దంలో ఐదు తరాలు ఉండేవి. పిల్లలు 25 ఏళ్లకు పెళ్లి చేసుకున్నప్పుడు, ఒక శతాబ్దంలో 4 తరాలు ఉండేవి. ఇప్పుడు పిల్లలు 30 ఏళ్లకు పెళ్లి చేసుకుంటున్నప్పుడు, ఒక శతాబ్దంలో 3 తరాలున్నాయి. ఇలా ఉంటే మన సమాజం తదుపరి శతాబ్దం వరకు మనుగడ సాగిస్తుందా అనేది ప్రశ్నార్థకమే.. వీధులు. పరిసరాలు నిర్మానుష్యంగా ఉన్నాయి, సమీపంలోని ఇళ్ళు ఖాళీగా ఉన్నాయి. ఇళ్లలో పిల్లల శబ్దం తక్కువ, భార్యాభర్తల గొంతులు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అమ్మాయిలు 30–35 ఏళ్ల వరకు అవివాహితులుగా ఉంటున్నారు. అబ్బాయిలు 35 తర్వాత కూడా అవివాహితులుగా ఉంటున్నారు. ఆలస్య వివాహాలు... ఆపై విడాకులు, విరిగిన కుటుంబాలు, అసంతృప్త తల్లిదండ్రులు ఇది మనకు కనిపిస్తోంది.



తల్లిదండ్రులు ఒంటరి తనం అనుభవిస్తున్నారు. మొత్తం తరం శూన్యతను అనుభవిస్తోంది. దీనిని మనం "విద్యావంతమైన సమాజం" అని పిలవాలా లేక "స్వీయ-వినాశక సమాజం" అని పిలవాలా? ఇది జనాభాను తగ్గించడానికి ఒక నిశ్శబ్ద కుట్రలా కనిపిస్తోంది. 50 జంటలలో ఒక్కొక్కరికి ఒక్క పిల్లవాడు మాత్రమే ఉంటే, తరువాతి తరంలో పిల్లల సంఖ్య నామమాత్రంగా ఉంటుంది. ఇది కొనసాగితే, మూడో తరం దాదాపు కనుమరుగైపోతుంది. పరిసరాలు, వీధులు ఖాళీగా ఉన్నాయి. అందరూ రోడ్లపైనే ఉన్నారు. జీవితంలో సగం రోడ్లపైనే గడుస్తోంది. మొత్తం గ్రామాలు కనుమరుగవుతున్నాయి. నగరాల్లో ఎత్తైన భవనాలు ఉన్నాయి, కానీ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ముగిసింది. కొత్త కోడళ్లు "ఒక్క పిల్లవాడు మాత్రమే" కావాలనుకుంటున్నారు. ఇదేనా సమాజం? ఇదేనా మన పూర్వీకుల వారసత్వం? నిజం ఏమిటంటే... పిల్లలు ఇక ప్రేమకు చిహ్నం కాదు. బదులుగా, పిల్లలను కనడం ఒక బలవంతం లాగా అనిపిస్తోంది. అతిపెద్ద తప్పు. అమ్మాయి తండ్రిది, అదే తండ్రి 20–22 లో పెళ్లి చేసుకొని కుటుంబాన్ని ప్రారంభించాడు. ఇప్పుడు ఆ తండ్రి 30 వరకు కూతురికి పెళ్లి చేయకుండా ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఫలితం? అబ్బాయిలు, అమ్మాయిలు డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. ఈ రోజు పిల్లలకు సరైన సమయంలో పెళ్లి కానీ, సరైన సమయంలో ఉద్యోగం కానీ రావడం లేదు. సమాజం క్రమంగా క్షీణిస్తోంది. అందుకే పిల్లలు సమాజంతో కలిసి ఉండటం కంటే ఒంటరిగా ఉండటానికి ఇష్టపడుతున్నారు. అంటే, అణు కుటుంబాలు, పిల్లలను కూడా కోరుకోవడం లేదు. ఆలస్యంగా పెళ్లి, ఆలస్యంగా పిల్లలు, ఆపై ఒక పిల్లవాడి తర్వాత వైద్యం, పెంపకం సమస్యల గురించి సాకులు సాధారణమైపోయింది. వయస్సు కారణంగా వేలాది మంది యువతీ యువకులు అవివాహితులుగా తిరుగుతున్నారు. సమాజంలోని విజ్ఞులు మౌనంగా ఉన్నారు. వివాహం, కుటుంబం, పిల్లలు అన్నీ భారంగా చూడబడుతున్నాయి. వివాహం ప్రాపంచిక బంధం కాదు. ఇది ఇల్లు, కుటుంబం, సమాజం యొక్క స్తంభం. ఇది జాతి, నాగరికత, సంస్కృతిని ముందుకు తీసుకెళ్లే మార్గం. ఇప్పుడు మనమందరం అర్థం చేసుకోవాల్సిన సమయం. పిల్లలకు "చాలా ఎక్కువ" స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా, మనం వారి వివేచనను తీసేశాం. వివాహం ఆలస్యం అవుతూ వచ్చింది, అది జరిగే సమయానికి అప్పటికే ఆలస్యమైపోయింది. మళ్ళీ అదే ఒంటరితనం. వివాహానికి సరైన వయస్సు అబ్బాయిలకు 25 లోపు, అమ్మాయిలకు 20 లోపు లేకపోతే చరిత్ర రాస్తుంది "ఆ సమాజం నిశ్శబ్దంగా తనను తాను నాశనం చేసుకుంది." ఆలోచించి తెలివిగా వ్యవహరించండి. మీ పిల్లలకు సమయానికి పెళ్లి చేయండి. ఎందుకంటే కుటుంబం సంరక్షించబడకపోతే, సమాజం కూడా కూలిపోవడానికి ఎక్కువ సమయం పట్టదు. అందుకే డేవిడ్ సెల్బోర్న్ మరియు బిల్ వార్నర్ వంటి రచయితలు ఇస్లాం యొక్క బలమైన కుటుంబ వ్యవస్థ కారణంగా, చాలా దేశాలలో భారతదేశంలో కూడా, కుటుంబ సంప్రదాయం యొక్క క్షీణత ప్రారంభమైంది.

**అంతరించిపోయే అంచున ఐదు రక్త సంబంధాలు**

పెదనాన్న, చిన్నాన్న, అత్త, మామ, పిన్ని అలాంటి బంధాలు భవిష్యత్తులో కనిపించకపోవచ్చు లేదా వినిపించకపోవచ్చు. ఒకే పిల్లవాడు ఉన్న కుటుంబాల నిర్ణయం మూడవ తరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మీరు తాత/నానమ్మ/అమ్మమ్మ అయ్యే తరం. అసలు కంటే వడ్డీని ఎక్కువగా ప్రేమించే తాత, అసలును కూడా కోల్పోతాడు. దానికి అతనే బాధ్యుడు అవుతాడు. అందువల్ల, జంటలు ఒకే పిల్లవాడు అనే నిర్ణయం గురించి తీవ్రంగా ఆలోచించాలి. ఈ తగ్గుతున్న జనాభా గణాంకాలు మాట్లాడుతున్నాయి. ఈ విశ్లేషణ ప్రభుత్వ డేటాను అధ్యయనం చేయడం ద్వారా వచ్చింది. మీ మనవడు లేదా మునిమనవడు ఈ ప్రపంచంలో ఒంటరిగా నిలబడతాడు. అతనికి రక్త సంబంధాలు అవసరమైతే, ఈ మొత్తం విశ్వంలో అతనికి చెందినవారు ఎవరూ ఉండరు. ఇది లోతైన ఆందోళన కలిగించే విషయం. ఇది మన పిల్లలను ఒంటరి జీవితాలను జీవించమని బలవంతం చేయడమే కాకుండా మన కుటుంబ నాగరికతను కూడా నాశనం చేస్తుంది. మనం ఐక్యత గురించి మాట్లాడతాము కానీ నాగరికతే కనుమరుగైపోతుంది. ఇవన్నింటికీ ప్రస్తుత తరం బాధ్యత వహిస్తుంది. మీరు ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తే, అప్పుడు ఈ సమస్య గురించి ఆలోచించండి. ఇంట్లో, భార్యాభర్తలు, బంధువులు, స్నేహితుల మధ్య. వివిధ సమావేశాలు, కార్యక్రమాలలో దీని గురించి చర్చించండి. మీ నాగరికత, విలువలు. భవిష్యత్ తరాలను కాపాడండి.

**సర్వేలో కనుగొన్న ప్రధాన కారణాలు:**

1. నేటి అమ్మాయిలు ఉన్నత విద్యను పొందుతూ తమ కెరీర్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు.
2. వారు ఆర్థికంగా స్వతంత్రులు మరియు ఎవరిపైనా ఆధారపడాలని కోరుకోవడం లేదు.
3. వారు స్వేచ్ఛను ప్రేమిస్తారు, తమ జీవిత నిర్ణయాలను తామే తీసుకోవాలనుకుంటున్నారు.
4. వారు వివాహం, మాతృత్వం, కుటుంబ బాధ్యతలను తమ పురోగతికి అడ్డంకులుగా చూడటం ప్రారంభించారు.
5. ఈ ధోరణి కొనసాగితే, సాంప్రదాయ కుటుంబ వ్యవస్థ, సామాజిక నిర్మాణం కూలిపోవచ్చు.
6. జనాభా తగ్గుదల, అవివాహిత పురుషుల సంఖ్య పెరగడం, వృద్ధాప్యంలో ఒంటరితనం సమస్యలు తలెత్తవచ్చు.
7. జీవితం చివరిలో తోడుగా ఉండటానికి ఎవరూ లేకపోతే, పురోగతి, హోదా, డబ్బు వల్ల ఏమి ప్రయోజనం అనే ప్రశ్న ఉదయిస్తుంది.

# పని ప్రదేశంలో వాతావరణం

నేడు "ప్రపంచ పని ప్రదేశ భద్రత మరియు ఆరోగ్య దినోత్సవం సందర్భంగా)

ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని వాతావరణం పొందే కనీస ప్రాథమిక హక్కు ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 28 ఏప్రిల్ రోజున "ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత మరియు ఆరోగ్యం దినోత్సవం (వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హమల్త్ ఎట్ వర్క్)" అనబడే కార్యక్రమాన్ని 2003 నుంచి ఐరాసకు చెందిన ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నిర్వహిస్తోంది. వృత్తిపరమైన ప్రమాదాలు, వ్యాధుల నివారణను ప్రోత్సహించడానికి, పని ప్రదేశాల్లో భద్రతతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని పెంచడానికి అవసరమైన అవగాహనను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. కార్మికులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన పని పరిస్థితులను కల్పించడం యాజమాన్యాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. ఉద్యోగంలో అనుకోని ప్రమాదాలు, వ్యాధులు అనే ప్రధాన సమస్యలతో 2.3 మిలియన్ల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. పనిలో భద్రత, ఆరోగ్యాల కల్పనలో ఏఐ, డిజిటల్ టెక్నాలజీ పాత్ర: "ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం" వేదికగా ప్రభుత్వాలు, సంస్థలు, ట్రేడ్ యూనియన్లు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 2026 ప్రపంచ పని ప్రదేశాల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం ఇతివృత్తంగా "పని ప్రదేశంలో మంచి మానసిక సామాజిక వాతావరణం – అభివృద్ధిలో శ్రామికులు, సంస్థల సన్మార్గ ప్రయత్నాలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. దాదాపు 50% కార్మికులు పని ప్రదేశాల్లో అభద్రత, అనారోగ్యాలను ఎదుర్కొంటున్నారని తెలుస్తున్నది. ఆసియాలో కార్మికులు అత్యధికంగా వీటి బారినపడి ప్రాణాలు కోల్పోవడం లేదా అనారోగ్యాల కోరల్లో



చిక్కడం ఆందోళనను కలిగిస్తున్నది. పని ప్రదేశ అనారోగ్యాల్లో హృద్రోగాలు అధికంగా నమోదు కావడం దురదృష్టకరం. ఐరాస – ఐఎల్ఓ వివరణ ప్రకారం పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యకర వాతావరణం పొందడం వారి కనీస హక్కు అని తెలుసుకోవాలి. అన్ని పనుల్లోకెల్ల గనుల్లో పని చేసే కార్మికులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అత్యాధునిక టెక్నాలజీ వాడకంతో తగ్గిన ప్రమాదాలు: వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం పొందడానికి నేటి అత్యాధునిక ఏఐ, డిజిటల్ టెక్నాలజీలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ప్రమాదకరమైన పని ప్రదేశాలు, విష పదార్థాల నియంత్రణ, అతి ఉష్ణోగ్రతలు, ప్రమాదకర వాతావరణం లాంటి పరిస్థితుల్లో రోబోటిక్స్ వాడడం వల్ల పనులు త్వరగా, సులభంగా పూర్తి అవుతున్నాయి. రోబోలు, డ్రోన్లు లాంటి సాంకేతిక ఆవిష్కరణలతో ప్రమాదకరమైన పనులను తేలికగా చేయడం, ప్రమాద హెచ్చరికలకు డిజిటల్ సెన్సార్లు వాడడం సర్వసాధారణం అయిపోయింది. టెక్నాలజీని తొందరపడి వాడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కూడా తెలుసుకోవాలి. నేడు రోబోటిక్స్, ఏఐ – ఎంఎల్, ఎగ్జోస్కెలిటన్స్, మానవ రహిత వైమానిక వాహనాలు, ఐఓటి, రిమోట్ కంట్రోల్ వర్క్, వర్చువల్ అండ్ ఆగ్యుమెంటెడ్ రియాలిటీ లాంటి టెక్నాలజీలను ప్రమాదకర పని ప్రదేశాల్లో వినియోగించడం క్రమంగా పెరుగుతోంది. వృత్తిపరమైన ఆరోగ్యం, సురక్షిత వాతావరణమే ప్రాధాన్యంగా సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, వాతావరణ మార్పులను అడ్డుకోవడం వల్ల ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030 కూడా సుసాధ్యం అవుతాయని గమనించాలి. పని ప్రదేశాల్లో భద్రత కొరవడినపుడు కార్మికుల అనారోగ్యాలు పెరిగి వారితో ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతూ, దీర్ఘకాలిక వ్యాధుల బారినపడతారని గమనించాలి. ఈ విషయాలన్నీ గమనిస్తూ పని ప్రదేశాల్లో సరైన భద్రత చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం వల్ల ఉత్పత్తి పెరిగి దేశాభివృద్ధి వేగమ పుంజుకుంటుందని తెలుసుకుందాం, శ్రామికుల ఆరోగ్యమే యాజమాన్యాల మహాభాగ్యమని నమ్ముదాం.



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# మేరా భారత్ మహాన్




కుల వివక్షతతో మతాల చిచ్చుతో
దైవాల విద్వేషాలతో
అంధకారపు మనోభావాలతో
మండుతున్న నిప్పురవ్వల
ఈ దేశం ఎప్పుడు ప్రమాదాలకు
పుట్టినిల్లు
ఏడు, ఎనిమిది పదుల
స్వాతంత్ర్యంలో
స్వార్థపరుల రాజ్యంలో
సామాజిక,ఆర్థిక, రాజకీయాలకు
దూరమే
ఈ దేశ మెజారిటీ జనజీవనం వ్యక్తిగత రాజకీయాల ఎత్తుగడలలో
ఎన్నెన్నో అల్లర్లు విధ్వంసాలు
ఏదో ఉద్ధరిస్తున్నట్టు ప్రజాప్రతినిధులు
తమ స్థిరచరాస్తులు అంకితం చేస్తున్నట్టు
సమాజంపై కనీస అవగాహన(సామాజిక స్పృహ),
కనికరం లేకపోవడం దురదృష్టకరం ఐనా ఏదో ఆశ...
ఈ దుర్మార్గ వ్యవస్థ మారకపోతుందా..
మంచి జరగకపోతుందా
ఇంకా ఇంకా చెప్పాలంటే
ఒకరి పట్ల ఒకరు గౌరవంతో ఉండడం
భిన్నత్వంలో ఏకత్వం ఏకత్వంలో
భిన్నత్వం లాగా ఉంటూ
దేశం పట్ల అంకిత భావంతో
దేశ ఉత్పత్తులను, ఆస్తులను
కాపాడుటయే దేశభక్తి
మేరా భారత్ మహాన్...



రఘువరన్
9010483021

# "ప్రాణాలపై లాభాల రాజ్యం, నిశ్శబ్దంలో దాచిన మరణాలు"

దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని చెబుతున్నారు. పరిశ్రమలు పెరుగుతున్నాయి, జీడీపీ అంకెలు ఎగబాకుతున్నాయి, నగరాలు విస్తరిస్తున్నాయి. కానీ ఈ మెరుపు వెనుక దాగి ఉన్న చీకటి వైపు చూస్తే ఒక కఠిన సత్యం బయటపడుతుంది, ఈ అభివృద్ధి మార్గం మీద నడుస్తున్నది యంత్రాలు కాదు, మనుషుల ప్రాణాలే. ప్రమాదాలు, పేలుళ్లు, మరణాలు ఇప్పుడు అపవాదాలు కాదు, ఒక విధమైన సాధారణంగా మారుతున్నాయి. మరింత భయంకరమైనది ఏమిటంటే, ఈ మరణాలన్నీ నిశ్శబ్దంలోనే కూరుకుపోతున్నాయి.2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సక్తి జిల్లా సింగిటరాయి గ్రామంలో వేదాంత సంస్థ నిర్వహిస్తున్న తాప విద్యుత్ కేంద్రంలో జరిగిన పేలుడు మొదట ఒక అనుకోని ప్రమాదంలా వినిపించింది. కానీ రోజులు గడిచేకొద్దీ బయటపడిన వివరాలు అది నిర్లక్ష్యపు వ్యవస్థ ఫలితమని స్పష్టంచేశాయి. ప్రారంభంలో 17గా ఉన్న మరణాల సంఖ్య 24కు పెరగడం, పలువురు ఇంకా ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం బాయిలర్ ఫర్నేస్‌లో అధికంగా ఇంధనం పేరుకుపోవడం వల్ల ఒత్తిడి పెరిగి పేలుడు సంభవించింది. అంటే ఇది ఒక్కసారిగా జరిగిన సంఘటన కాదు, ముందే గుర్తించాల్సిన లోపం. ప్రమాదం అనే పదం ఇక్కడ బాధ్యతను దాచిపెట్టే కవచంగా మారుతోంది.పోలీసులు నిర్లక్ష్యంతో మరణాలకు కారణమనే సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సంస్థ యాజమాన్యంలో ఉన్న కీలక వ్యక్తుల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చబడ్డాయి. అంటే ఇది కేవలం సాంకేతిక వైఫల్యం కాదు, బాధ్యతతో కూడిన వ్యవస్థాగత లోపం. ఇక్కడ ప్రశ్నించాల్సిన వారు స్పష్టంగా ఉన్నారు, భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన సేఫ్టీ ఆడిట్ సంస్థలు ఎక్కడ ఉన్నాయి, కార్మికుల రక్షణ చూసుకోవాల్సిన లేబర్ ఇన్‌స్పెక్టరేట్ ఏమి చేసింది, పర్యావరణ అనుమతులు ఇచ్చిన అధికారులు ఈ లోపాలను ఎందుకు గుర్తించలేదు. ఈ ప్రశ్నలకు సమాధానం లేకపోవడమే ఈ వ్యవస్థ యొక్క అసలు ముఖం.ఇదే సమయంలో తమిళనాడులోని విరుదునగర్‌లో ఫైర్‌క్రాకర్ యూనిట్‌లో జరిగిన పేలుడులో కనీసం 23 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అనుమతించిన కంటే ఎక్కువ మంది పని చేయించడం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. గతంలో కూడా ఇలాంటి ప్రమాదాల్లో వందలాది మంది చనిపోయినా, పరిస్థితి మారలేదు. ఇది యాదృచ్ఛికం కాదు, ఇది నిరంతర నిర్లక్ష్యం.దేశవ్యాప్తంగా ఉన్న పర్యావరణ నియంత్రణ సంస్థలు, ముఖ్యంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయా లేదా అన్న ప్రశ్న ఇక్కడ మరింత గట్టిగా వినిపిస్తోంది. అనుమతులు కాగితాలపైనే ఉంటే, నేలమీద జరిగేది మరణాలే. నియమాలు ఉల్లంఘించబడుతున్నాయని తెలిసినా చర్యలు తీసుకోకపోవడం, ఇది కేవలం వైఫల్యం కాదు, ఇది ప్రత్యక్ష సహకారం.ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారు ఎక్కువగా వలస కార్మికులే. పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన ఈ కూలీలు నగరాలను నిర్మిస్తారు, కానీ వారి జీవితాలు మాత్రం ఎప్పుడూ నిర్మాణంలోనే కూలిపోతుంటాయి. వీరి ప్రాణాలు కంపెనీ లెక్కల్లో అంకెలుగా మారిపోతాయి. పరిహారం ఒక ఫార్మాలిటీగా మిగిలిపోతుంది. యంత్రాల మధ్య నలిగిపోతున్నది కేవలం శరీరాలు కాదు, సామాన్య మానవుడి హక్కులు.ఈ సంఘటనలు సేఫ్టీ ఆడిట్ వైఫల్యం, లేబర్ పర్యవేక్షణ లోపం, పర్యావరణ నియంత్రణ సంస్థల నిర్వీర్యత కలిసి సృష్టించిన ఫలితాలు. చట్టాలు ఉన్నా అమలు లేకపోతే బాధ్యత ఎవరిది. చట్టం బలవంతుడి చుట్టంగా మారినప్పుడు, బడుగు జీవి ప్రాణం ఒక ఫైల్ నంబర్‌గా మిగిలిపోతుంది.ఇక్కడ ఒక పెద్ద మోసం జరుగుతోంది, "అభివృద్ధి" అనే పేరుతో. పరిశ్రమలు, లాభాలు, జీడీపీ అంకెలే అభివృద్ధి అన్న భావనను ప్రజలపై రుద్దుతున్నారు. కానీ ప్రశ్నించాలి, ప్రాణాలు తీసే యంత్రాలను నిర్మించడం పురోగతా, పర్యావరణాన్ని నాశనం చేసి కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టడం ఏ రకమైన నాగరికత. అడవి కేవలం వనరు కాదు, అది ఒక సంస్కృతి. ఆ సంస్కృతిని నాశనం చేయడం అంటే మానవత్వాన్ని ఖూనీ చేయడమే.రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, గ్రామ సభల అధికారాలు, ఆదివాసీ ప్రాంతాల రక్షణ కోసం చేసిన చట్టాలు కాగితాలపైనే మిగిలిపోయాయి. నేలమీద మాత్రం తుపాకీ గొట్టం, అనుమతుల ముద్ర, కార్పొరేట్ ఒత్తిడి మాత్రమే పనిచేస్తున్నాయి. ఇది చట్టాల వైఫల్యం కాదు, చట్టాలపై ఆధిపత్యం.ప్రభుత్వం, కార్పొరేట్ శక్తులు, మాధ్యమాలు, ఈ మూడింటి మధ్య ఉన్న అనుబంధం ఈ మౌనాన్ని మరింత బలపరుస్తోంది. మీడియా ప్రజల గొంతుకగా కాకుండా ప్రకటనల వేదికగా మారుతోంది. ప్రమాదాలు జరిగినా అవి కొద్ది సేపట్లోనే మరుగున పడిపోతున్నాయి. ప్రజల దృష్టిని మళ్లించడం ఒక వ్యూహంగా మారింది. పరిశ్రమల నుంచి వచ్చే పొగ కంటే, పాలకుల మౌనం ఎక్కువ విషపూరితమైనది.ఇది ప్రమాదాల శ్రేణి కాదు, ఇది ఒక వ్యవస్థ. ఒక చోట జరిగిన మరణం జాతీయ విపత్తుగా, మరో చోట సాధారణ ఘటనగా చూపించడం విలువల అసమానతను బయటపెడుతుంది. ప్రాణానికి ఉన్న విలువ కూడా పరిస్థితిని బట్టి మారుతుందా అనే ప్రశ్న మన ముందుంది.వేదాంత ఘటన మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్‌లో పండగల పేరుతో జరిగిన ప్రమాదాల్లో కూడా పలువురు ప్రాణాలు కోల్పోయారు. కానీ వాటిని జాతీయ విపత్తుగా గుర్తించడం లేదు. పేదల మరణాలు సాధారణ వార్తలుగా మిగిలిపోతున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు, ఇది విలువల రాజకీయాలు."ఇది ఒక్క వేదాంత్ ఘటన కాదు. రాజస్థాన్‌లో బాలోత్రా జిల్లాలో రూ.79,450 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రిఫైనరీలో, ప్రధానమంత్రి ప్రారంభోత్సవానికి ఒక్క రోజు ముందు అగ్ని ప్రమాదం జరిగింది. కమిషనింగ్ దశలోనే హైడ్రోకార్బన్ లీకేజ్ వల్ల మంటలు చెలరేగినట్లు చెబుతున్నారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. కానీ ఇదే ఘటన అదుపులోకి రాకపోయి ఉంటే మరో వేదాంత్‌గా మారేది. అభివృద్ధి పేరుతో భద్రతా ప్రమాణాలను పక్కనబెట్టి, రాజకీయ ప్రచారాల కోసం తొందరపాటు ప్రారంభాలు ఎంత ప్రమాదకరమో ఈ ఘటన చెబుతోంది. ఇది మొదటిసారి కాదు. 2016లో పరదీప్ రిఫైనరీలో కూడా ఇలాగే ప్రారంభానికి ముందు అగ్ని ప్రమాదం జరిగింది. అంటే ప్రశ్న ఒక్కటే, ప్రజల భద్రత ముఖ్యమా? లేక రాజకీయ ప్రచారం ముఖ్యమా?"ఇప్పుడు ప్రశ్నలు మాత్రమే కాదు, చర్య కూడా అవసరం: 1. నిజాలను సామాజిక మాధ్యమాల ద్వారా బలంగా ప్రచారం చేయాలి. 2. బాధిత కుటుంబాలకు న్యాయం కోసం ప్రజా ఒత్తిడి తీసుకురావాలి. 3. స్థానికంగా ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలు, ప్రజా విచారణలు నిర్వహించాలి. 4. కార్మిక హక్కుల కోసం సంఘాలతో ఐక్యంగా నిలబడాలి.పరిశ్రమలను క్రమబద్ధీకరించడం, భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయడం, కార్మికులకు తప్పనిసరి భీమా కల్పించడం ఇవి కనీస చర్యలు మాత్రమే. కానీ అసలు మార్పు రావాలంటే మౌనం చెదరాలి. ఈ మరణాలు ప్రమాదాలు కావు, ఇవి అనుమతించిన హత్యలు. బాధ్యత లేని వ్యవస్థ, లాభాల కోసం పరుగులు తీసే సంస్థలు, మౌనంగా చూస్తున్న పాలకులు కలిసి రాసిన రక్త చరిత్ర ఇది. ప్రశ్నించని ప్రతి క్షణం, ఈ వ్యవస్థకు మరో ప్రాణాన్ని త్యాగం చేసే అనుమతిపత్రం అవుతోంది.అందుకే ఇప్పుడు మౌనం కాదు, ప్రతిఘటన అవసరం. మనమే మీడియా కావాలి, మన గొంతులే వార్తలు కావాలి. చీకటి ఎంత గాఢంగా ఉన్నా, నిజాన్ని ఎంతో కాలం దాచలేరు

– పాపని నాగరాజు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 28.04.2026
www.mudranews.in | @mudranews



**నేరేడు పండ్లు :** డయాబెటిస్ ఉన్నవారు గింజల పొడి వాడండి నేరేడు గింజలను ఎండబెట్టి పొడి చేసి ఉదయం తీసుకుంటే షుగర్ కంట్రోల్‌కి సహాయపడుతుంది.



## సంక్షిప్తంగా..

### జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్



**ముద్ర, నారాయణపేట:** నారాయణ పేట మండలం అప్పక్ పల్లి గ్రామ సమీపంలో గల ప్రభుత్వ జిల్లా అసుప్రతిని మెడికల్ కళాశాలన సోమవారం సాయంత్రం కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రిసెప్షన్ వద్దకు వెళ్లి రోజుకు ఎంత మంది ఔట్ పేషంట్స్ వస్తారని అడిగి తెలుసుకున్నారు. రెండో అంతస్తులో పలు వార్డులను పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులతో మాట్లాడి ఆస్పత్రి లో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగుల బంధువులు కొందరు ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆస్పత్రికి ఆర్వో ప్లాంట్ లేదా అని ఆర్ ఎం వో శ్రీనివాసులును ప్రశ్నించారు. ఇంతకు ముందు ఒక బోరు వేస్తే నీళ్ళు పడలేదని, ప్లాంటు కూడా లేదని ఆయన కలెక్టర్ కు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆస్పత్రి సమావేశ మందిరంలో అర్ ఎం వో లు, అన్ని విభాగాల హెచ్. ఓ డీ లు, వైద్యులతో సమీక్ష జరిపారు. ఆస్పత్రి క్యాడర్ స్టెంత్, అన్ని విభాగాలలో రోజుకు ఎంత మంది అవుట్ పేషెంట్స్ వస్తారని, అవసరమైన వైద్య పరికరాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, టీబీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా లేదా అని ప్రశ్నించగా అన్ని రకాల పరీక్షలు చేస్తున్నామని ఆయా విభాగాల హెచ్వోడీలు జవాబిచ్చారు. డయాలసిస్ సేవల గురించి కలెక్టర్ ఆరా తీయగా పాత చిల్డ్రన్ అస్పత్రిలో డయాలసిస్ సెంటర్ కొనసాగుతోందని అర్ ఎం వో తెలిపారు. ఆస్పత్రి నిర్వహణ, ఇతర వసతి సదుపాయాలు, సమస్యలపై కలెక్టర్ చర్చించారు.

### చైతన్య మెమోరియల్ సెంటర్ ప్రారంభం




**ముద్ర, కూకట్‌పల్లి :** సమాజ సేవలో నిరంతరం తపించే శ్రీ జనంపల్లి విక్రమ్ దేవ్ రావు తన కుమారుని జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చైతన్య మెమోరియల్ సెంటర్ ప్రారంభమైంది. వైద్య విజ్ఞానం, సామాజిక చైతన్యం లక్ష్యంగా రూపొం దిన ఈ కేంద్రాన్ని శ్రీ విక్రమ్ దేవ్ రావు, జ్యోతి రావు దంపతులు ఆవిష్కరించారు. యువతలో చైతన్యం రగిలించడం, సృజనాత్మక ఆలోచనలను పంచుకోవడం, మానవాళికి మేలు చేసే వైద్య విజ్ఞాన వేదికగా తీర్చిదిద్దడం. ఆలోచనలు, ఆశయాలు కలిసే పవిత్ర ఆలయంగా, సమాజ శ్రేయస్సు కోరే చర్చలకు ఇది నిలయం కావాలని వ్యవస్థాపకులు ఆకాంక్షించారు. మీరా రావు, ఆదిత్య రావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణా రావు, జనంపల్లి, పింగళి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే రామదేవరావు హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె. కమలాకర్, శివానంద రీహాబిలిటేషన్ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం




వట్టెం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీనివాస–పద్మావతి పరిణయం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. కైంకర్యంగా వట్టెం మాజీ సర్పంచ్ బత్తినీ అమృత్ రెడ్డి–భార్గవి దంపతులు సేవలందించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీ ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ సందడి ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి చంద్రారెడ్డి పాల్గొన్నారు. – ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక గులాబీ జెండా



### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ముద్ర, కాప్రా:** అలుపెరగని పోరాటంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన చారిత్రక జెండా సంక్షేమం, అభివృద్ధి పథంలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపిన గౌరవ చిహ్నం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని,ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ బి ఆర్ ఎస్ పార్టీ నాచారం, కాప్రా ధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వారి యోగక్షేమాలను నిరంతరము పర్యవేక్షిస్తానని తెలిపారుఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, సాయి జన శేఖర్ పార్టీ నాయకులు తీగుళ్ల శ్రీనివాస్ గౌడ్ , కుంటి కృష్ణ , వాసుదేవ్ గౌడ్ , ప్రవీణ్ , శ్రీనివాస్ నెల్లుట్ల , మల్లేష్ , ఉస్మాన్ , దయాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



### తాండూర్‌లో..

**ముద్ర, తాండూరు:** బీ ఆర్ ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తాండూరులోని మాజీ ఎమ్మెల్యేపైలెట్ రోహిత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో తాండూర్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కోట్రీకే విజయలక్ష్మి , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింలు, మాజీ ఫ్లోర్ లీడర్ శోభారాణి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు నవీన, సుప్రియ, నాగలక్ష్మి , జావేద్, యోగానంద్, సురేష్ నాయక్, నాయకులు ఇర్ఫాన్, బషారత్ అలీ, సలీం, సంతోష్ గౌడ్, రుద్రు పాటిల్, ఇంతియాజ్, భీమ్ సింగ్, అనంత రెడ్డి, బి ఆర్ ఎస్ వి నాయకులు దత్తాత్రేయ, ఇబ్రహీం, వినోద్, సోహెబ్, బాంబినో, కోట్రీకే శ్రీకాంత్, ఫైసల్ ఖాన్, అస్ఫక్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల భద్రతలో జిల్లా అగ్రగామిగా నిలవాలి

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బాలల భద్రత, రక్షణ మరియు సంక్షేమం అంశాలలో జిల్లా అగ్రగామిగా నిలవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళలు, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "బాలల భద్రత – డ్రగ్స్ అడ్డుకట్ట" అవగాహన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహించే డ్రగ్స్ రహిత తెలంగాణ సంక్షేమ వారోత్సవాల ప్రారంభ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. డ్రగ్స్ అనే సామాజిక వ్యాధి చిన్నారుల భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని, దీనివల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ వ్యవస్థలు కూడా దెబ్బతింటాయని హెచ్చరించారు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి రాజేశ్వరి, జిల్లా ఎక్సైజ్ అధికారిణి గాయత్రి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీశైలం, ఎన్జీవోలు పాల్గొన్నారు.




### స్వీయ జనగణనలో పాల్గొనాలి

స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాతలతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాలు, 460 గ్రామాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 86 వార్డుల్లో జనగణనను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 2500 మంది సిబ్బంది నిమగ్నమై ఉన్నారని చెప్పారు. స్వీయ గణన పూర్తయ్యాక ప్రతి కుటుంబానికి రిఫరెన్స్ నంబర్ అందుతుందని, తరువాత ఇంటికి వచ్చే గణన అధికారికి ఆ నంబర్ చూపిస్తే వివరాలను ధృవీకరించి తుది ఆమోదం ఇస్తారని వివరించారు. స్వీయ గణన చేయని వారి వద్దకు గణన అధికారులు వెళ్లి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. రేషన్ కార్డులు, పింఛన్లు, గృహ పథకాలు, ఓటరు గుర్తింపు కార్డులతో జనగణనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ప్రభుత్వాలకు కేవలం గణాంకాల రూపంలో మాత్రమే సమాచారం అందుతుందని హామీ ఇచ్చారు. మే 11 నుంచి గణన అధికారులు ఇంటికి వచ్చి ఈ వివరాలను ధృవీకరిస్తారని, రెండో దశలో వ్యక్తుల వారీగా పూర్తి వివరాలు నమోదు చేయబడతాయని తెలిపారు.

### ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

యాసంగి సీజన్ కు సంబంధించిన మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ అమరేందర్తో పాటు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో పంట సాగు విస్తీర్ణం, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షిస్తూ, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సమర్థవంతంగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాం టి ఆలస్యం లేకుండా వెంటనే ధాన్యం స్వీకరించాలని సూచించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని, తూకం ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు.

## ఆలయ ఆవరణలో అభివృద్ధి పనుల పరిశీలన



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లాతాండూరు పట్టణంలోని పోట్లి మహారాజ్ దేవాలయ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పట్టణ ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అన్నారు. దేవాలయ ఆవరణ అభివృద్ధి ద్వారా భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అలాగే, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయిన తర్వాత స్థానిక వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పట్టణ ఆర్థికాభివృద్ధికి ఇది తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమలు చేపడుతున్నామని, ప్రతి పనిలో పారదర్శకత మరియు నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, దేవాలయ చైర్మన్ ప్రసాద్ గౌడ్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా రహిత తెలంగాణే లక్ష్యం



**ముద్ర, కూకట్‌పల్లి :** తలసేమియా రహిత తెలంగాణ రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో–ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పిలుపునిచ్చారు. ఛత్రపతి ధర్మ రక్షణ సేన అధ్యక్షుడు కర్ర వేణుగోపాల్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ రోడ్ నెంబర్ 1లో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో మనిషి సృష్టించలేనిది ఏదైనా ఉందంటే అది కేవలం రక్తం మాత్రమేనని అన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు ఒకటి రెండు సార్లు రక్త మార్పిడి తప్పనిసరని, ప్రస్తుతం వేసవి కాలం కావడంతో రక్త నిల్వల కొరత ఏర్పడిందని గుర్తు చేశారు. ఇలాంటి సమయంలో యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని, ఒక్కసారి రక్తదానం చేస్తే ఒక ప్రాణాన్ని కాపాడినట్లేనని అన్నారు. ఈ శిబిరంలో దాతల నుంచి మొత్తం 122 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన యువతను, వారి కుటుంబాలను 'రక్తదాతల కుటుంబం'గా గుర్తిస్తామని నిర్వాహకులు కొనియాడారు. కార్యక్రమంలో ఛత్రపతి ధర్మ రక్షణ సేన సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, స్వచ్ఛంద కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తమ పిలుపు మేరకు రక్తదానానికి సహకరించిన దాతలకు,కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అల్లాపూర్ భూములపై ఎమ్మెల్యేవి అబద్ధపు ప్రచారం




**ముద్ర, కూకట్‌పల్లి:** అల్లాపూర్ డివిజన్ సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ భూమి విషయంలో స్థానిక హ్యాట్రిక్ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు. నిన్న సదరు స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, యథావిధిగా కాంగ్రెస్ పార్టీపై బురద చల్లడమే ధ్యేయంగా మాట్లాడటం శోచనీయమన్నారు. సర్వే నంబర్ 18లో ఉన్న 4ఎకరాల17గుంటల ప్రభుత్వ భూమిలో 10 ఏళ్లుగా మదర్సా నిర్మిస్తామని చెబుతూ, హ్యాట్రిక్ ఎమ్మెల్యే రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో, రెండుసార్లు కార్పొరేటర్ ఎన్నికల్లో ఓట్లు దండుకున్నారని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా ఆ భూమిని ఎందుకు కాపాడలేకపోయారని ప్రశ్నించారు.అసలు 4 ఎకరాల పైచిలుకు ఉన్న భూమి ఇప్పుడు2 ఎకరాలకు ఎలా తగ్గిందో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. "మీ స్థానిక నాయకులే ఆ భూమిని ప్లాట్లుగా చేసి పేదవారికి విక్రయించి, అక్రమ నిర్మాణాలు చేయించింది వాస్తవం కాదా?" అని నిలదీశారు. దీనిపై హైడ్రా రెవెన్యూ లేదా పోలీస్ శాఖలతో విచారణ జరిపించడానికి తాము సిద్ధమని, ఎమ్మెల్యే ఇందుకు సహకరించాలని సవాల్ విసిరారు. ప్రజల నుండి నీరాజనాలు అందుకుంటున్న 'హైడ్రా' వ్యవస్థపై ఎమ్మెల్యే ఎందుకు అంత ఆక్రోశం వెళ్లగక్కుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. అధికారులపై, ప్రభుత్వంపై బురద చల్లడం మానేసి, మానసిక ప్రశాంతత కోసం యోగా కేంద్రంలో చేరాలని హితవు పలికారు.కాంగ్రెస్ నాయకులు రూ. 400 కోట్ల విలువైన భూమిని కబ్జా చేస్తున్నారని ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ ఘాటుగా స్పందించింది. ఆ కబ్జాకు పాల్పడుతున్ననాయకులు ఎవరో పేర్లు బయటపెట్టాలి.ఆరోపణలు నిజమని తేలితే సదరునాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమే కాకుండా, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెబుతాము.ఆధారాలు లేకుండా మాట్లాడితే ప్రజలే బుద్ధిచెబుతారు.అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ, పోలీస్ శాఖలు తక్షణమే స్పందించి, వాటిని కూల్చివేసి కేసులు నమోదు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరును అడ్డుకోకుండా, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తేనే 'హ్యాట్రిక్' అనే పేరుకు సార్థకత ఉంటుందని సూచించారు. ఈ విషయంలో చర్చకు సిద్ధం అని స్పష్టం చేశారు.

## వికలాంగులకు సర్టిఫికెట్ జారీలో జాప్యం లేదు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో వికలాంగులకు ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సేవలు అందుతున్నాయని వికలాంగు ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. సోమవారం సమితి సమావేశం సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో సదరం ప్రక్రియలో అధికారులు చురుకైన విధంగా వ్యవహరిస్తూ, సర్టిఫికెట్ల జారీని వేగవంతంగా పూర్తి చేస్తున్నారని ప్రశంసించారు.శిబిరాలకు వచ్చిన వికలాంగులకు కూర్చోవడానికి సౌకర్యం, తాగునీటి వంటి మౌలిక వసతులు కల్పించడం సంతోషకరమని తెలిపారు. అయితే కొంత మంది వ్యక్తులు నాయకులుగా చలామణి కావడం కోసం సంఘానికి, వికలాంగులకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. నాయకులు శ్రీశైలం, మంతటి కృష్ణయ్య, సేరి కాశన్న, వడ్డేమాన్ రాజు, వెలుగొండ శంకర్, పరశురాములు, మంతటి శేఖర్ పాల్గొన్నారు.

## మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

**ముద్ర, మల్కాజిగిరి:** మహిళలను వేధింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత డీసీపీ ఉషారాణి హెచ్చరించారు. మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని సూచించారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, పాఠశాలలు, మార్కెట్లు షీ టీమ్స్ సివిల్ డ్రెస్సులో డికాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని తెలిపారు.16 నుంచి ఇప్పటివరకు వరకు మొత్తం 59 మంది (49 పెద్దలు, 10 మైనర్లు) వేధింపుల కేసుల్లో పట్టుబడగా, ఎల్‌బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.ఏప్రిల్ 1 నుంచి 15 వరకు 72 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో ఫోన్ కాల్స్ ద్వారా 19, సోషల్ మీడియా ద్వారా 23, ప్రత్యక్ష వేధింపులు 30 కేసులు ఉన్నాయి. ఈ కేసుల్లో 6 క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 19 చిన్న కేసులు బుక్ చేసి, 38 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతన్నలు మోసపోవద్దని గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హన్మంతు అన్నారు., సోమవారం కేటిదొడ్డి మండలం కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, ప్రభుత్వం సూచించిన తేమ శాతంతో కేంద్రానికి తీసుకురావాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యానికి



సంబంధించిన డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణ మండల నాయకులు ఉరుకుంద, ఉప సర్పంచ్ వీరన్న గౌడ్ వార్డు మెంబర్లు జంగిలప్ప,మహిళా సంఘం అధ్యక్షురాలు శకుంతలమ్మ బుక్ కీపర్ పావని, పార్టీ సీనియర్ నాయకులు యుగంధర్ గౌడ్, కొండన్న, వీరేష్, చంద్రశేఖర్, భీమేష్ నల్లారెడ్డి పాల్గొన్నారు

# ప్రజావాణికి 33 ఫిర్యాదులు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 33 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. అదనపు కలెక్టర్లు అమరేందర్, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయం తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా నుంచి 167 కే జాతీయ రహదారి విస్తరణలో తమ ప్లాట్లు కోల్పోతున్నామని, నష్టపరిహారం తక్కువగా చెల్లిస్తున్నారని, మార్కెట్ రేటుకు అనుగుణంగా పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. పూర్తి వివరాలు సేకరించి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమానికి తొలిసారి హాజ రైన కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం ప్రతి అధికారికీ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. కార్యాలయాల్లో పారదర్శకత, సమయపాలన పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి శాఖ తమ పనితీరును మెరుగుపరచి ప్రభుత్వ పథకాలు లక్ష్యాలకు చేరేలా కృషి చేయాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని అన్నారు. అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 28.04.2026
www.mudranews.in | @mudranews



**నేరేడు పండ్లు:**



ఉప్పు చల్లి తింటే జీర్ణక్రియ మెరుగవుతుంది
కొద్దిగా ఉప్పు వేసుకుని తింటే గ్యాస్, అజీర్ణం తగ్గుతుంది.

# వారానికి మించి పెండింగ్ ఉంచొద్దు

**- ప్రజావాణి దరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి**

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:**
ప్రజావాణి దరఖాస్తులను వారానికి మించి పెండింగ్ లో ఉంచొద్దని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా లెక్టర్ మాట్లాడుతూ 226 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందువల్ల వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్క రించాలని స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇప్పటికీ వారానికి మించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులన్నీ పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ మొత్తంలో పెండింగ్ లో ఉన్న పలు శాఖలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు సంబంధిత శాఖకు బదిలీ కావడంలో ఆలస్యమైనా ప్రజావాణి ఆన్ లైన్ లో దరఖాస్తులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తుపై తీసుకున్న చర్య గురించి అర్జీదారునికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు. ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణ దేవాలయంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక ప్రార్థనలు



**ముద్ర, న్యూఢిల్లీ:** పంజాబ్ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అమృత్‌సర్‌లో గల స్వర్ణ దేవాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం హర్యానాలోని చండీగఢ్ లో చింతన్ శివర్ కార్యక్రమం ముగించుకొని సోమవారం అమృత్‌సర్ చేరుకున్నారు. మంత్రి ముందుగా గురుద్వారాలోని పవిత్ర సరస్సులో నది స్థానం చేసిన అనంతరం స్వర్ణ దేవాలయంలో గురుగ్రంథ్ సాహిబ్‌కు నమస్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశం, రాష్ట్రం ప్రజల శ్రేయస్సు కోసం గురుద్వార్ సందర్శించి ప్రత్యేక ప్రార్థన నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు సాదర స్వాగతం పలికారు ఆలయ విశిష్టతలు, చరిత్రను మంత్రికి వివరించారు. మంత్రి అడ్లూరి గురుద్వారా సంప్రదాయం ప్రకారం లంగర్ సేవలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణ దేవాలయం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు దేశ ఐక్యతకు, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ప్రతీకలని పేర్కొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**ముద్ర, కోరుట్ల:**
సీనియర్ న్యాయవాది గంగుల సత్యార్థ ప్రకాశ్ పై దాడి ని నిరసిస్తూ సోమవారం కోరుట్ల లో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఒక సీనియర్ న్యాయవాదిపై దాడి చేయడం హేమమైన చర్య అని న్యాయవ్యవస్థలో న్యాయవాదులకే రక్షణ కరువైతే సామాన్యంగా పరిస్థితి ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ఈ దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి దాడి వెనుక ఎంతటి వారున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బార్ అసోసియేషన్ పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బార్ అసోసియేషన్ పక్షాన కోరుట్ల సీఐ లక్ష్మి నారాయణకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, కోరుట్ల:**
కోరుట్ల పట్టణంలోని స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి నారాయణ రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ పార్టీని స్థాపించి అన్ని వర్గాలను ఏకం చేయడానికి అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఎందరో అమరుల త్యాగ ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత కేసీఆర్ దేనని, ఇప్పటికి ఎప్పటికి తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ రక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొట్ట సురేందర్, వసీం, మోసిన్, కొక్కెర వెంకటేష్, నాయకులు మోహన్ రెడ్డి, సజ్జు, ఎలుగురి కిరణ్, జాల వినోద్, గెల్లె శ్రీనివాస్, గెల్లె గంగాధర్, అడేపు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ముద్ర, కోరుట్ల:**
కథలాపూర్ మండలం లోని పలు గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి, వైస్ చెర్పర్సన్ పులి శిరీష హరిప్రసాద్ ప్రారం మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు న్యావనంది శేఖర్, సర్పంచులు, ఏపీమ్ రాజయ్య, ఉపసర్పంచ్ లు డైరెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యం

**- బీఆర్ఎస్ వీ జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్**



**ముద్ర, కరీంనగర్:**
ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని కరీంనగర్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ వీ జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ వీ ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధా కరమన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డి నేటర్ ద్వావ మధుసూదన్ రెడ్డి, ఎస్ యూ ఇంచార్జి చుక్క శ్రీని వాస్, నగర అధ్య క్షుడు బొం కురి మోహన్, ఎస్ఆర్ఆర్ కళా శాల అధ్యక్షుడు నాయిని అన్వేష్, సీనియర్ నాయకులు అరె రవి గౌడ్, గంగాధర చం దు, వడ్లకొండ శ్రీకాంత్, విక్రమ్, ఓంకార్ పాల్గొన్నారు.

# స్వీయ గణనను సద్వినియోగం చేసుకోవాలి

**- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జనగణనలో భాగంగా స్వీయ గణన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాలో స్వీయ గణనపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జనగణనను రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన, రెండో విడతలో జనాభా గణన నిర్వహిస్తారని వివరించారు. ఆధునిక డిజిటల్ సాంకేతికత ద్వారా ఖచ్చితమైన, పారదర్శకమైన డేటా సేకరణ జరుగుతుందని తెలిపారు.

**స్వీయ గణన చేసిన కలెక్టర్..**

జనగణలో భాగంగా కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్వయంగా ఆయన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్వీయ గణన పూర్తి చేసినట్లు తెలిపారు. 5 నుంచి 10 నిమిషాల్లో స్వీయ గణన పూర్తవుతుందన్నారు., అధికారులు ముందుగా తొందరగా స్వీయ గణన పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేస్తాం

**- ఎస్పీ జానకి షర్మిళ**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లాలో మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం కృత నిశ్చయంతో ఉందని ఎస్పీ జానకి షర్మిళ స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం "గాంజా గస్తీ" బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై జిల్లాలో కఠిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో గాంజా వ్యాప్తిని పూర్తిగా అరిక ట్టేందుకు ప్రత్యేక చర్యలుతీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా గాంజా వినియోగం, రవాణా, విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతను గాంజా వంటి మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పార్టీ జెండా ఎగురవే శారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్య క్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, కౌన్సి లర్ లు దేవేందర్ నాయక్, అవారి శివ కేసరి బాబు, కోరుగాంటి రాము, తోట హరీష్, శ్యా మల శేఖర్ , గాజుల రాజేందర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, మాజీ కౌన్సి లర్ లు ఒడ్డి శ్రీలత రామ్మోహన్, మ్యక పవ న్, దుర్గ య్యా, నాయకులు శీలం ప్రవీణ్, మల్లారెడ్డి, గుండా మదు, రాజేష్, కచ్చు హరీష్, గంగాధర్ పాల్గొన్నారు.

## 'సంఘటన్ ' సమావేశానికి హాజరైన కరీంనగర్ నాయకులు



**ముద్ర, కరీంనగర్:** హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో సోమవారం పీసీసీ ఆధ్వర్యంలో జరిగిన సంఘటన్ సృజయాన్ అభియాన్ కమిటీ నిర్మాణాల సమీక్ష సమా వేశానికి కరీంనగర్ జిల్లా నుంచి ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నిర్ణీత గడవులోగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియమకాలు, గ్రామ, మండల, జిల్లా కమిటీల నిమకాల గురించి చర్చించారు. పార్టీ నియమ, నిబంధనలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, సెక్రెటరీ సచిన్ సావాత్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా నుంచి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పూన శ్రీశైలం గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**ముద్ర, కరీంనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎలగందుల, ఆసిఫ్ నగర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల ధాన్యానికి తప్ప, తాలు పేరుతో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సుధారాణి, ఏపీఎం బువన్ చంద్ర, ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజ య్య, పంజాల స్వామి గౌడ్, ఉప సర్పంచ్ గసికంటి కుమార్, అరె మల్లేశం, గుండ మల్లే శం, కాడె ప్రశాంత్, ఆసిఫ్ నగర్ సర్పంచ్ ఆంజనేయులు, ఓరుగంటి చంద్రయ్య, దుర్గం అంజయ్య, దావ ప్రభాకర్, దుర్గం పరశురాం, సీసీలు కరుణాకర్, ప్రియదర్శిని, పాల్గొన్నారు.

## డీసీసీ కార్యాలయం నిర్మాణానికి నిధులివ్వండి

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి సర్వేనెంబర్ 218 ధరూర్ క్యాంపులో కేటాయించిన ఎకరం స్థలంలో కార్యాలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను డీసీసీ అధ్యక్షుడు నందయ్య కోరారు. ఈ మేరకు సోమవారం పీసీసీ అధ్యక్షుడిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పీసీసీ సెక్రటరీ బండ శంకర్, పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ గుంటి జగదీశ్వర్, పీసీసీ సేవాదళ్ సెక్రటరీ ముకేశ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**బోథ్, ముద్ర:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేయడం అభినంద నీయమని ఎంపీడీఓ రమేష్ అన్నారు. సోమవారం బోథ్ మండలం కౌట – బి లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కౌట – బి గ్రామానికి చెంది సైబర్ సెక్యూరిటీ వింగ్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వర్తిస్తున్న బొమ్మకంటి సురేం దర్ సామాజిక బాధ్యతగా తన గ్రామానికి చెందిన నిరుద్యోగ యువతకు అండగా నిలవడం సంతోష దాయకమనన్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షకీల్, వీడీసీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, లింగం పల్లి సంతోష్, అబ్దుల్ రావుఫ్, వెండి సోమేష్, వెండి పృథ్వీ, రాజు, రమణ గౌడ్ లతో పాటు గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## నేరేడు పండ్లు

నేరేడు పండ్లు ఎక్కువగా తినకండి అతి మోతాదులో తింటే గొంతు ఇబ్బందులు, మలబద్ధకం రావచ్చు.



## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 57అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 39,జిల్లా పంచాయతీ 5, చేనేత మరియు జౌళి 4, మున్సిపాలిటీ 2 , శిశు సంక్షేమ 2, జిల్లా వ్యవసాయ 2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్, సర్వే ల్యాండ్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దత్తతపై అవగాహన తేవాలి

- యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పిల్లల దత్తతపై క్షేత స్థాయిలో పూర్తి అవగాహన తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం జిల్లా మహిళా శిశు వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం యూనిట్ తో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా దత్తత సహాయ వాణీ (అడాప్షన్ హెల్ప్ డెస్క్), చైల్డ్ వీక్ కి సంబంధించిన స్టాండిస్ ఏర్పాటును ఆయన సందర్శించి మాట్లాడుతూ అక్రమ దత్తత జరగకుండా (ఇల్లీగల్ అడాప్షన్ జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని అదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకా రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీఎంఎండ్ ఎచ్ ఓ మనోహర్, జయ, బీ ఆర్ బీ కో ఆర్డినేటర్ అనంత లక్ష్మీ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది. మహిళా సాధికారత టీం డీసీపీయూ, చైల్డ్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా స్వాతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి మున్సిపల్ టిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా 17వ వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్ ఎన్నికయ్యారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు నాకోటి నగేష్, చీమల రాజు, ఏలే భువనేశ్వరి శివ పాల్గొని ఏకగ్రీవంగా చేన్న స్వాతి మహేష్ ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కుశంగల ఎల్లమ్మరాజు పాల్గొన్నారు.





## యాదగిరిగుట్టలో ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, యాదగిరిగుట్ట :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులకు సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ , ఆరే శ్రీధర్ గౌడ్, కల్వకొలను సతీష్ బట్, అంకం నరసింహ, బూడిద సురేందర్, కొన్యాల నరసింహారెడ్డి, గ్యాదపాక క్రాంతి, దండ్ల బాను, కరుణాకర్ మోతే నరసింహ , సిహెచ్ చిరంజీవి, మిట్ట వెంకటేష్ గౌడ్, సర్దార్, పబ్బాల సాయి చందు, ఆకుల రాజశేఖర్ పాల్గొన్నారు.

## పోలీసులకు సమాచారం ఇవ్వాలి



**ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి:** వేధింపులపై పోలీసులకు సమాచారం అందించాలని భరోసా సెంటర్ సిబ్బంది తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఐదో అంశం మహిళల భద్రత పిల్లల భద్రత మాదకద్రవ్యాల నిర్మూలన సందర్భంగా ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు సోమవారం సూర్యాపేట జిల్లా పోలీసు మహిళా భరోసా సెంటర్ సిబ్బంది జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో, వివాహ, షీ నీడ్స్ షాపింగ్ మాల్స్ లో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ సిబ్బంది మాట్లాడుతూ.. మహిళలపై వేధింపులు, ఎలాంటి ఆకృత్యాలు జరిగినా ఉపేక్షించకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు విద్యార్థులు పిల్లల భద్రతలో చట్టాలు బలోపేతం చేయబడ్డాయని గుర్తు చేశారు. పిల్లల కు మంచిస్పర్శ, చెడు స్పర్శ ,ఎవరేది ఇచ్చిన తీసుకోవద్దని చెప్పాలని చెప్పడం జర్గింది. అలాగే లింగ సమానత్వం గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో యువత మాదకద్రవ్యాల బారిన పడి వారి ఆరోగ్యాలను భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు పిల్లల నడవడిక పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పవిత్ర, జ్యోతి, కిరణ్మై, వనజ, శృతి, ప్రమీల పాల్గొన్నారు.



## యాదాద్రి బీఆర్ఎస్ కార్యాలయంలో వేడుకలు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొలుపుల అమరేందర్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్ చీమల రాజు, సీనియర్ నాయకులు ఇట్టబోయిన గోపాల్, చేన్న మహేష్, శెట్టి బాలయ్య, కాజా అజీముద్దిన్, తాడూరు బిక్షపతి, ఎన్నబోయిన జాంగిర్, రత్నపురం పద్మ, ఎండి ఇస్మాయిల్, శాగంటి నరసింహ, గుజ్జ పవన్, హనుమంతు, వెంకటేష్, అంజద్, పెంట నితీష్, ఎర్రోజు నరేష్, కొత్త సత్యం, గడ్డం యాదగిరి, సైదులు, విక్రమ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



**సూర్యాపేట ఎస్పీ నరసింహ**

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయం నందు పిర్యాదుదారులతో మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా కల్పించాలి అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



## తాజ్ పూర్ లో వేడుకలు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాబోయే ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మరపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కే హైమద్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమం దేశానికే ఆదర్శం



**ముద్ర, తుంగతుర్తి:** తెలంగాణ ఆత్మ గౌరవ జెండా ఎగిరిన చారిత్రాత్మక రోజు అని, అసాధ్యమని అనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సుసాధ్యం చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీది అని ఆ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య గులాబీ జెండా ఎగరవేయగా, మండల పరిధిలోని అన్ని గ్రామ స్థాయిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 2001 ఏప్రిల్ 27 న కేసీఆర్ ఎగర వేసిన గులాబీ జెండా నేడు తెలంగాణ ప్రగతి ఆత్మ గౌరవానికి ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం లక్ష్యం నెరవేరిందన్నారు. అధికార గర్వంతో ఉన్న ఆనాటి కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచి రాష్ట్ర సాధన కోసం కృషి చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ జెండా మోసిన కార్యకర్తలకు పాధాభివందనం అన్నారు. అమరవీరుల త్యాగం మరువలేనిదనీ, వారి ఆకాంక్షల సాధనే ధ్యేయంగా బీఆర్ఎస్ ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, దొంగరి శ్రీను, తునికి సాయిలు, మహిళా మండల కమిటీ అధ్యక్షురాలు తునికి లక్ష్మి,బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు కుంచాల శ్రీనివాసరెడ్డి, తప్పట్ల ఎల్లయ్య, చింతకుంట్ల మనోజ్, మేడుదుల రమేష్, మాతంగి వెంకటమ్మ కరుణాకర్, మల్యాల రాములు, గాజుల యాదగిరి, గుండ గాని దుర్గయ్య, కొండగడుపుల నాగయ్య, గొపగాని రమేష్, తడకమల్ల రవికుమార్, గొప్పగాని శ్రీను, రవి నాయక్, రచ్చ నవిన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తుంగతుర్తి లో ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**గ్రామ గ్రామాన రెపరెపలాడిన గులాబీ జెండా**

## ఎమ్మెల్యే సారూ.. నిధులివ్వండి



**ముద్ర, తుంగతుర్తి:** గ్రామ అభివృద్ధికి సిడిపి నిధులు కేటాయించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మందుల సామెల్ ను వినమ్రంగా అభ్యర్థించారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని వెంపటి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం మాజీ సర్పంచ్ కొండగడుపుల నాగయ్య మాట్లాడుతూ... ఎమ్మెల్యే సారూ... మీకు దండం పెడతాం... మా గ్రామానికి సిడిపి నిధులు ఇచ్చి అభివృద్ధికి తోడ్పడండి అంటూ తమ బాధలను వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రాథమిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, ముఖ్యంగా రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో నాటి శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ చేసిన అభివృద్ధి, వాటికి గుర్తులుగా నాడు వేసిన శిలాఫలకాలు కనిపిస్తున్నాయి తప్ప నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న గ్రామంలో ఎక్కడ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఎద్దేవ చేశారు.

# రాష్ట్రంలో పూర్వ వైభవం రావాలి



**ముద్ర, ఖమ్మం:** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని రఘునాథపాలెం మండల పరిధిలోని మంచుకొండలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా రాము నాయక్ పార్టీ జెండా ఎగురావేశారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు మందడపు మాధవరావు మాట్లాడుతూ... తెలంగాణకు పూర్వవైభవం రావాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభంజనం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ తేజావత్ శంకర్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్ తోనే సాధ్యమని అన్నారు. పల్లెలు పచ్చగా ఉండాలంటే బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని అన్నారు. మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మా నాయక్ మాట్లాడుతూ... తండాలను పంచాయతీలుగా గుర్తించిన ఘన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ దే అని అన్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్ను లింగం, మాజీ ఉప సర్పంచ్ తేజవత్ రమేశ్, వార్డ్ సభ్యులు రవి, నాయకులు బొడ్డు లాజర్, ధరావత్ మోహన్, ధరావత్ వీరన్న, వడిగల వెంకటేశ్వర్లు, వడిగల నరసింహారావు, భూక్యా అజయ్ కుమార్, తేజావత్ రాములు, బాదావత్ అశోక్, భూక్యా ప్రసాద్, నల్లగట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు

## ఏఆర్ ఎస్సై కుటుంబానికి చెక్కు అందజేత

**ముద్ర, భద్రాద్రి జిల్లా:** జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వరస్తూ గుండెపోటుతో ఇటీవల మరణించిన ఏఆర్ఎస్సై ప్రకాశరావు కుటుంబానికి సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**నేరేడు పండ్లు : నీటితో వెంటనే తాగొద్దు**

నేరేడు తిన్న వెంటనే నీరు తాగితే జీర్ణ సమస్యలు రావచ్చు.





## మెదక్‌లో 4 కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

- హాజరైన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పురపాలక సంఘంలో నలుగురు కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. మెదక్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక సందర్భంగా, ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మెజార్టీ సభ్యులు ఉండటంతో, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నామినేషన్ దాఖలు చేసిన నలుగురు కోఆప్షన్ సభ్యులు రాగి వనజ (మాజీ కౌన్సిలర్), కొర్వి రాములు (మాజీ సర్పంచ్), తాహేర్ అలీ, అనూషలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ రావులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు టపాసులు పేల్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు మరో భారీ షాక్

- ఇప్పటి వరకు ఏడుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిక

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్‌లో బీఆర్ఎస్‌కు మరో భారీ షాక్ తగిలింది. బీఆర్ఎస్ తరఫున 3వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన కొట్టాల లలిత విశ్వం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైర్మన్ ఎన్నిక సమయంలో లలిత, బీఆర్ఎస్ చైర్మన్ పదవికి పోటీ చేసి ఒక్క ఓటుతో ఓడిపోయారు. ఈమె చేరిక రాజకీయంగా సంచలనంగా మారింది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ రావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా లలిత విశ్వం కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం 22కు చేరగా, బీఆర్ఎస్ బలం 15 నుంచి 8కి తగ్గింది. రాబోయే రోజుల్లో మరికొందరు చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## మేడే క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయం

- క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం
- మేడే సందర్భంగా శ్రామికోత్సవాలను జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

మానసిక ఒత్తిడి నుంచి ఆరోగ్యంగా ఉండటానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, మేడే సందర్భంగా క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. సోమవారం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మేడే క్రికెట్ టోర్నమెంట్‌ను కాముని గోపాలస్వామి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు రోజువారీ డ్యూటీలు చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతారని, క్రీడలు ఆడడం ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న సీఐటీయూ మేడే సందర్భంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మేడే సందర్భంగా శ్రామికోత్సవాలను జయప్రదంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికుల శ్రమతోనే సంపద సృష్టించబడుతుందని, దేశ నిర్మాణంలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్మికుల శ్రమను గౌరవించాలని కోరారు. లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులపై దాడి జరుగుతోందని, మేడే స్ఫూర్తితో వాటిని తిప్పికొట్టాలని అన్నారు. మేడే శ్రామికోత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ వీఎస్ రాజు మాట్లాడుతూ, క్రికెట్ టోర్నమెంట్‌కు 14 టీములు పాల్గొన్నాయని, స్నేహపూర్వకంగా ఆటలు ఆడాలని సూచించారు. మేడే సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటికి అందరూ సహకరించాలని కోరారు. ఈరోజు ఉదయం 10 గంటలకు హిందుస్థాన్ వర్సెస్ యువచైతన్య టీముల మధ్య జరిగిన మ్యాచ్‌లో యువచైతన్య టీం గెలుపొందింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, క్రికెట్ టోర్నమెంట్ క్రీడా కోఆర్డినేటర్ కొండం సంజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ బాను, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మే 1న సిద్దిపేటలో అంతర్జాతీయ 'ముషాయిరా'

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

అంజుమన్ మొహబ్బానేఎఉర్దూ సంస్థ ఆధ్వర్యంలో మే 1వ తేదీ, శుక్రవారం రాత్రి 9 గంటలకు సిద్దిపేటలోని మదీనా ఫంక్షన్ హాల్‌లో 48వ అంతర్జాతీయ కవుల సమ్మేళనం (ముషాయిరా) నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సయ్యద్ మిస్కిన్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెరుగు రాజనర్సు, డాక్టర్ సతీష్, వేలేటి రాధాకృష్ణ శర్మ, ఉబైద్ అలీ సాబ్రీ, జుబేర్ హుస్సేన్, ఫియాజ్ నిజాముద్దీన్ అన్సారీ (ముంబై), తాజ్ అహ్మద్ ఖాన్ గౌరవ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. దుబాయ్ నుంచి డాక్టర్ జుబైర్ ఫరూక్ అల్ అర్షీ, మస్కట్ నుంచి యాహ్యా ఖాన్‌తో పాటు ఆగ్రా, అలీఘర్, ముంబై, హైదరాబాద్, తెలంగాణ జిల్లాల నుంచి పలువురు హాస్య, గంభీర ముషాయిరాలు వినిపించే కవులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి కవితాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కన్వీనర్ ఫక్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి ముజఫర్ ఆరిఫ్ కోరారు. గతంలో కేసీఆర్, గవర్నర్, అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రముఖ వార్తాపత్రికల సంపాదకులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారని గుర్తుచేశారు. విరామం లేకుండా నిరంతరంగా నిర్వహించడంలో సిద్దిపేట ముషాయిరా ఉర్దూ ప్రపంచంలో విశేష ఖ్యాతి గాంచిందని తెలిపారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

- వేసవి జాగ్రత్తలు తీసుకోండి : కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులు, సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం, మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు మరింత పుంజుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 880 మంది రైతుల నుంచి 4270 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, 38 మంది రైతులకు రూ. 42 లక్షలు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు మూడు దశల్లో టోకెన్ పద్ధతి అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు తు.చ తప్పకుండా పాటించాలని, తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తేమ శాతం ఉన్న ధాన్యం కూడా వేగంగా కొనుగోలు అయ్యేలా చూడాలన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తికాగానే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం బస్తాలను వెంటనే తరలించాలని సూచించారు. రవాణాలో ఎలాంటి ఆలస్యం లేకుండా అవసరమైన లారీలను సమయానికి అందుబాటులో ఉంచేలా నిర్వాహకులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఎండల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, టోకెన్ల ఆధారంగా కేంద్రాలకు రావాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, తహసీల్దార్ సింధు రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బాలల భద్రత, రక్షణలో అగ్రగామిగా నిలవాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారం పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. యువతకు సంరక్షణ అనంతరం మద్దతు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి బయటకు వచ్చే 18 సంవత్సరాలు పైబడిన వారికి మార్గదర్శనం, నివాసం, నైపుణ్యాభివృద్ధి మరియు జీవనోపాధి అవకాశాల కల్పనపై అవగాహన కల్పించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాస్ రావు బాలల హక్కుల ప్రదర్శనను ప్రారంభించారు. బాలల సంరక్షణ, భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, బాలల భద్రత, సంరక్షణ మరియు మత్తు పదార్థాల నివారణలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిత్యం పర్యవేక్షణ కలిగి ఉండాలని, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతోందని, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంలో పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేస్తుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. బాలికలు, చిన్నారులపై ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. గ్రంథాలయ చైర్‌పర్సన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ, బాలల సంరక్షణ, భద్రత మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. పురాతన కాలంలో ఉమ్మడి కుటుంబాలలో అమ్మమ్మలు, తాతయ్యలు చిన్నపిల్లలకు చేదోడుగా ఉండి మంచి, చెడు బోధించేవారని, తద్వారా సరైన అవగాహన, క్రమశిక్షణ గల జీవనశైలిలో పెరిగే వారని తెలిపారు. అనంతరం బాలల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ చిన్నారులతో ముచ్చటించి.వారికి అందుతు న్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున బాలల సంరక్షణ కేంద్రంలో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, ఆర్టీసీ డీఎం సురేఖ, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్జీవో సునీత, అంగన్వాడి, సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం

- కలెక్టర్ కె. హైమావతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుంచి మొత్తం 98 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా పాలన' కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించాలి

- కలెక్టర్ కె. హైమావతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 27వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారాన్ని పటిష్టంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, పోలీస్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి దత్తత సహాయ కేంద్రం (అడాప్షన్ హెల్ప్ డెస్క్) 'ఊయల' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 27వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించే బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారానికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవోలు, ఎంపీడీవోలు, పోలీస్, మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా సోమవారం దత్తత సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణురాలు శాంతి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ హాఫ్ డే ఆఫ్టర్ కేర్ క్యాంప్ నిర్వహణలో భాగంగా శిశు సంరక్షణ సంస్థల్లో ఉన్న పిల్లలకు వ్యక్తిగత అనంతర సంరక్షణ ప్రణాళిక (ఇండివిజువల్ ఆఫ్టర్ కేర్ ప్లాన్-ఐఏపీ)పై అవగాహన కల్పించారు. గృహ, విద్య, నైపుణ్యాలు, జీవనోపాధి, ఆరోగ్య మార్గదర్శకత్వానికి అనుసంధానం చేయడం, శిశు సంరక్షణ సంస్థల్లో నివసించి 18 సంవత్సరాలు నిండిన పిల్లలకు మానసిక ఆరోగ్యం, అక్రమ రవాణా, దుర్బలత్వం, నిరాశ్రయత, పదార్థ వినియోగంపై అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి శారద, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, డాక్టర్ శాంతి (మానసిక వైద్య నిపుణురాలు, జీజీహెచ్ సిద్దిపేట), వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

- తెలంగాణ మాలమానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కోదాది శ్రీనివాస్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

సిద్దిపేట జిల్లాలో పౌర హక్కుల దినాన్ని క్రమబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకుని, ప్రతి నెల 30వ తేదీన అన్ని మండలాల్లో ఒక గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలంగాణ మాలమానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కోదాది శ్రీనివాస్ కోరారు. జిల్లా వ్యాప్తంగా పౌర హక్కుల దినం ఎక్కడా సక్రమంగా నిర్వహించబడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో వార్షిక క్యాలెండర్ రూపొందించి, ప్రతి మండలంలో ప్రతి నెల 30వ తేదీన ఏ గ్రామంలో పౌర హక్కుల దినం నిర్వహించాలో ముందుగానే నిర్ణయించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ సూచనల మేరకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని గ్రామ స్థాయిలో అమలు చేసేందుకు ఈ పౌర హక్కుల దినాన్ని నిర్వహించేవారని గుర్తు చేశారు. ముఖ్యంగా అంటరానితనం, రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయ ప్రవేశం వంటి సామాజిక సమస్యల నిర్మూలనకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పౌర హక్కుల దినం నిర్వహించని మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ నెల 30వ తేదీ నుంచే సిద్దిపేట జిల్లాలో ప్రతి మండలంలో ఒక గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, దీనిపై తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కోదాది శ్రీనివాస్ వివిధ ప్రజా సంఘాల తరఫున ఆయన విజ్ఞప్తి చేశారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలలో భాగంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కల్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. అనంతరం పంచముఖి హనుమాన్ దేవాలయం సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీలో రెండు వాటర్ ట్యాంకర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, హవేలీ ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, జిల్లా యువజన అధ్యక్షుడు పర్శరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.04.2026
www.mudranews.in | @mudranews



**నేరేడు పండ్లు:**



చర్మానికి మంచిది
నేరేడు రసం లేదా గుజ్జు చర్మంపై ఉపయోగిస్తే మొటిమలు తగ్గుతాయి.

# పెరిగిన మద్యం అమ్మకాలు

- ఏడాది వారీగా ఎక్సైజ్ ఆదాయం రికార్డు స్థాయికి
- లిక్కర్ పెరుగుదల.. బీరు అమ్మకాల్లో పడిపోయిన గ్రాఫ్
- రూ.40,209 కోట్లకు చేరిన మద్యం విక్రయాలు
- షాపులు, బార్ల ద్వారా భారీగా ప్రభుత్వానికి ఆదాయం
- తెలంగాణలో ప్రతి ఏడాది పెరుగుతున్న ఎక్సైజ్ కలెక్షన్లు




**ముద్ర, హైదరాబాద్:** మద్యం అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7 శాతంగా పెరిగాయి. 2025–26 అర్థిక సంవత్సరంలో 382.91లక్షల కేసుల లిక్కర్, 387.34 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. 2025–26 అర్థిక సంవత్సరంలో 2 శాతం లిక్కర్ సెల్స్ పెరుగగా, బీరు అమ్మకాలు 9 శాతం తగ్గాయి. 2024––25 అర్థిక సంవత్సరంలో 372.25 లక్షల కేసుల లిక్కర్, 536.13 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే బీరు అమ్మకాలు తగ్గాయి, లిక్కర్ అమ్మకాలు కొద్దిపాటిగా పెరిగాయి. 2025––26 అర్థిక సంవత్సరంలో నెలవారీగా మద్యం అమ్మకాలు ఎలా ఉన్నాయి. ఏప్రిల్‌లో రూ.3,272 కోట్లు, మేలో రూ.3,561 కోట్లు, జూన్‌లో రూ. 3,273, జూలైలో రూ.3,320 కోట్లు, ఆగస్టులో రూ. 3,082 కోట్లు సెప్టెంబరులో రూ.3,048 కోట్లు, ఆక్టోబర్‌లో రూ.2,709 కోట్లు నవంబర్‌లో రూ.2,868 కోట్లు , డిసెంబరులో రూ.5,051 కోట్లు, 2026 జనవరిలో రూ.3,325 కోట్లు, ఫిబ్రవరి రూ.3,208 కోట్లు, మార్చి 31 రూ.3,486 కోట్లు మొత్తంగా రూ. 40,209 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఎక్సైజ్‌శాఖకు 2620 ఏ – 4 మద్యం షాపుల ద్వారా సంవత్సరానికి రెంటల్ ఫీజ్ ద్వారా రూ. 1,771 కోట్ల ఆదాయం సమకూరింది. 1,214 బార్ల ద్వారా రూ. 549 కోట్ల ఆదాయం వస్తుంది. 2025–26 అర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖకు 95,628 దరఖాస్తుల ద్వారా రూ. 2,869 కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది.

**తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఎక్సైజ్ ఆదాయం..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పుష్కర కాలంగా ఎక్సైజ్‌శాఖకు అమ్మకాలు పెరుగుతూ వస్తున్నాయి. 2015–16లో రూ. 12,706 కోట్లు, 2016–17లో రూ. 14.184 కోట్లు, 2017––8లో రూ.17,597 కోట్లు, 2018–19లో రూ.20,859 కోట్లు, 2019–20లో రూ.22,605 కోట్లు, 2020–21లో రూ.27,286 కోట్లు 2021–22లో రూ.30,783 కోట్లు, 2022–23లో రూ. 35,145 కోట్లు, 2023–24లో రూ.37,675 కోట్లు, 2024–25లో రూ.37,488 కోట్లు 2025–26లో రూ. 40,209 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## బ్యాటరీ కాలమాన పరిశోధనలో తెలుగు విద్యార్థి సత్తా



**రాజేంద్రనగర్, ముద్ర ప్రతినిధి:** నేటి తరంలో విద్యుత్ వాహనాల ఉపయోగానికి ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ఖర్చులో ఎక్కువ దూరం ప్రయాణించడంతోపాటు, కాలుష్య రహిత వాహనాలు కావడంతో వీటి డిమాండ్ పెరిగి పోయింది. భవిష్యత్తు ఈ బ్యాటరీ వాహనాలదే అయిన అకస్మాత్తుగా బ్యాటరీలు ఫెయిల్ కావడం, పలుమార్లు వాహనాల బ్యాటరీలు పేలిపోవడం లాంటి దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. బ్యాటరీ ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, బ్యాటరీ పనితీరు మెరుగుపరచడం కోసం మన తెలుగు విద్యార్థి అమెరికాలో ప్రదర్శన ఇస్తూ సత్తా చాటారు. విజయవాడకు చెందిన పవన్ కుమార్ కారెడ్ల లంగర్ హౌస్ లోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యసించాడు. ప్రస్తుతం ఇతను అమెరికాలోని టయోటా ఉత్తర అమెరికాలో నియో సాఫ్ట్ ఐఎన్ సి లో ఉద్యోగం చేస్తూ బ్యాటరీ జీవన పరిమాణాన్ని పెంపొందించడంలో వాసవి కళాశాల ప్రొఫెసర్ల సహకారంతో పరిశోధనలు విస్తృతంగా చేస్తున్నారు. అమెరికాలోని డెట్రాయిట్‌లో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎస్ ఏ ఈ డబ్ల్యూ సి ఎక్స్ ప్రపంచ కాంగ్రెస్ అవగాహన 2026 సదస్సులో ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలపై తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిశోధనను ప్రదర్శించారు. ఈ పరిశోధనలో విద్యుత్ వాహనాల నెట్‌వర్క్‌లలో కేబుల్ రహిత కమ్యూనికేషన్ సవాళ్లను పరిగణనలోకి తీసుకుని బ్యాటరీల మిగిలిన జీవితకాలాన్ని రియల్–టైమ్‌లో అంచనా వేయగల సాంకేతికతను అభివృద్ధి చేసి ఆయన ప్రదర్శించారు. ఇది బ్యాటరీ పనితీరును ముందుగానే పసికట్టి మరింత సమర్థవంతంగా తీర్చుకునేలా మరమ్మతులు చేసుకునేలా ఉపయోగపడుతుందని పవన్ కుమార్ తెలిపారు. ఈ ప్రదర్శనతో ఆయనకు ఐఈఈఈ సీనియర్ సభ్యులుగా గౌరవం లభించింది. సదస్సులో పోస్టర్ ప్రదర్శనలు మరియు సాంకేతిక ఆధారిత ప్రసంగంతో పాల్గొన్న ఈ పరిశోధనకు హైదరాబాద్‌లోని వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌తో అకాడమిక్ అనుబంధం ఉంది. ప్రపంచ దేశాలకు పోటీగా తన ప్రతిభను చాటుతున్న పవన్ కుమార్ కు వాసవి కళాశాల యాజమాన్యం రామ్మోహన్ రావు , ప్రిన్సిపల్ రమణలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభినందనలు తెలియజేశారు.

## స్విమ్మింగ్ పూల్‌లో పడి బాలుడు మృతి



**ముద్ర, కాప్రా:** కుషాయిగూడ స్పోర్టివ్ స్పోర్ట్స్ ప్లెక్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో పడి బొడ్డు హృతిక్ (11) అనే బాలుడు మృతిచెందాడు. సోమవారం సాయంత్రం స్విమ్మింగ్‌పూల్‌లో బాలుడు పడినట్లు గమనించిన సిబ్బంది వెంటనే బయటకి తీసి ఆసుపత్రికి తరలించారు. కాని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈసీఐఎల్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న హృతిక్ బీఎన్‌రెడ్డి, చర్లపల్లికి చెందిన బొడ్డు రాజుకు కొడుకు. కేసు కుషాయిగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది.

# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** అన్నదాతల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న పంటను తరలించేందుకు లారీల కొరత ఉందని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి మార్క్‌ఫెడ్ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి, కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీల కొరత లేకుండా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకువచ్చిన వెంటనే తూకం వేయాలని, ఆలస్యం లేకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

రైతులు నిర్ణీత తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పం టను కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి సూచించారు. పెద్దకొత్తపల్లిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో పరిసర గ్రామాల రైతులకు రవాణా ఖర్చులు తగ్గి, సమ యం ఆదా అవుతుందని తెలిపారు. దళారుల జోక్యం లేకుండా రైతులకు నేరుగా మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. కొను గోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణా రావు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, పీఏసీఎస్ ప్రతినిధులు, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ ఇందిరమ్మ ఇళ్లపై మంత్రుల సమీక్ష




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ లో కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హిమాయత్ నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో ఎంపీలు నగేష్, గడ్డం వంశీ, ఎమ్మెల్సీలు దండే విఠల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, పాయల శంకర్, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీశ్ బాబు పాల్గొన్నారు. అలాగే రెవిన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతమ్, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, హరిత, భవేశ్ మిశ్రా, కుమార్ దీపక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ గ్రామీణ మండలం ఎల్లపల్లి లో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారం అందుకున్న అధికారులు స్పందించి సకాలంలో చేరుకొని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం–2006 ప్రకారం18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురకి వివాహం చేయడం నేరమని వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్న వారిలో జిల్లా బాలల సంరక్షణ అధికారిణి దేవి, మురళి, సూపర్వైజర్ మంగళ, సమన్వయకర్తలు నల్ల గంగాధర్, సుప్రియ, శ్రీదేవి, పద్మావతి ఉన్నారు.



# రైతుల కష్టాలు చూస్తే కడుపు తరుక్కుపోతోంది

- పాలమూరు ఎంపీ డీకే అరుణ
- గద్వాల మార్కెట్ యార్డును సందర్శించిన ఎంపీ
- ప్రభుత్వానికి సోయి లేదు, రైతులకు ముందుచూపు లేదు
- వెంటనే మల్దకల్, గట్టు మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గద్వాల మార్కెట్‌లో మొక్కజొన్న రైతుల కష్టాలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని పాలమూరు ఎంపీ డీకే ఆరుణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గద్వాల మార్కెట్ యార్డును ఆకస్మికంగా సందర్శించారు. మార్కెట్ యార్డులో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్క్‌ఫెడ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వెంటనే అదనపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా మల్దకల్, గట్టు మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎకరాకు 25 క్వింటాళ్ల పరిమితిని తొలగించి రైతుల వద్ద ఉన్న పూర్తి స్థాయి మొక్కజొన్నను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల కనీస అవగాహన, ముందుచూపు లేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లాలో సుమారు 2.70 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న పంట పండినట్లు అధికారుల వద్ద ముందస్తు సమాచారం ఉన్నా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చేశారని మండిపడ్డారు.

మద్దతు ధర రూ.2,400 ఉన్నప్పటికీ, ప్రభుత్వ కేంద్రాలు సరిగ్గా నడవకపోవడంతో రైతులు బయట తక్కువ ధరకు అమ్ముకొని క్వింటాల్‌కు రూ.700 నుండి రూ.800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో సంచులు, హమాలీలు, లారీలు లేవని అధికారులు చెప్పడం హాస్యాస్పదమని, రైతులు 15 రోజుల పాటు పంటకు కాపలా కాయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఎండలు మండిపోతున్నా మార్కెట్ యార్డులో రైతులకు తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, నాయకులు కృష్ణం రాజు, మురళీధర్ రెడ్డి, రజక నరసింహ, రఘు గౌడ్, బెల్లం నరసింహ, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు భారీ క్రేన్ కూలి ముగ్గురు మృతి

- సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో సంఘటన



**ముద్ర, రంగారెడ్డి:** సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో క్రేన్ కూలి ముగ్గురు మృతి చెందారు. శంకరపల్లి మండలం మహాలింగాపురంలో క్రేన్ కూలింది. ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో ప్రమాదవశాత్తు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్రేన్ కూలి ముగ్గురు మృతి చెందగా పది మందికి తీవ్రగాయాలు అయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా ఉంది, వారిని శంకరపల్లి ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని డాక్టర్లు చెబుతున్నారు.

**నేరేడు పండ్లు**

రక్తపోటు ఉన్నవారికి ఉపయోగం పొటాషియం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది.

# యూనిట్ కు రూ. 4.60కు తగ్గింపు

- విద్యుత్ కొనుగోలు ధరపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, ఏప్రిల్ 27:** రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ. 4.60కు తగ్గించే లక్ష్యంతో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ శాఖపై నిర్వహించిన సమీక్షలో ఈ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవిలో రోజుకు 275–285 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6,397 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైందని, గతేడాదితో పోలిస్తే 14 శాతం పెరుగుదల ఉందని తెలిపారు. ఏప్రిల్ 2025లో యూనిట్ ధర రూ.5.20గా ఉండగా, మార్చి 2026 నాటికి రూ.4.90కు తగ్గించామని అధికారులు వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి రూ. 4.60కు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలని, 2028–29 నాటికి సగానికి పైగా విద్యుత్‌ను పునరుత్పాదక వనరుల నుంచే ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకోసం ఎనర్జీ యూనివర్సిటీ ఏర్పాటు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని చెప్పారు.

పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటి వరకు 52,396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇవ్వగా, ప్రతి నెల 2 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టారు. పీఎం కుసుమ్ పథకంలో 2.94 లక్షల కనెక్షన్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని సీఎం చంద్రబాబు సూచించారు.

ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై సర్కార్ స్పెషల్ ఫోకస్

- జూన్ నాటికి లక్ష ఇళ్ల గృహప్రవేశాలు లక్ష్యం..
- జిల్లాల వారీగా సమీక్షలు.. సమస్యల పరిష్కారానికి చర్యలు
- పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు గ్రీన్ సిగ్నల్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూ భారతి కార్యక్రమాల అమలుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక సమీక్షలు ప్రారంభించారు. జిల్లాల మంత్రులు, కలెక్టర్లతో నిర్వహించే ఈ సమీక్షల్లో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ఉంది. నియోజకవర్గానికి 3500 ఇళ్ల లక్ష్యంగా.. పెండింగ్ బిల్లుల చెల్లింపులు వంటి కీలక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. జూన్ మొదటి వారానికల్లా లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

తెలంగాణలోని నిరు పేదలకు సొంత గూడు కల్పించటమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూ సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన భూ భారతి అమలుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి యుద్ధప్రాతిపదికన సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన శాసన సభ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన రెవెన్యూ, గృహనిర్మాణ సమస్యలకు పరిష్కారం కనుగొంటామని ఇచ్చిన హామీ మేరకు మంత్రి ఈ ప్రత్యేక భేటీలకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఉదయం నిజామాబాద్, మధ్యాహ్నం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల సమీక్షలు హైదరాబాద్ లోని హౌ సింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పాల్గొని క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు.

ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఆగిపోయిన సుమారు 35 వేల 200 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఒక స్పష్టత రానుంది. ఎవరికీ కేటాయించని ఈ ఇళ్లను ఇందిరమ్మ పథకం మొదటి విడతలోని ఎల్–2 జాబితాలోని లబ్ధిదారులకు అందజేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనివల్ల వృథాగా ఉన్న ఇళ్లు వినియోగంలోకి రావడమే కాకుండా, పేదలకు తక్షణమే ఆశ్రయం లభిస్తుంది. ఇందిరమ్మ పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం సజావుగా సాగేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 3.25 లక్షల ఇళ్లకు అనుమతులు ఇవ్వగా.. 2.66 లక్షల ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నా యి. సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయి న బిల్లుల చెల్లింపులను తక్షణమే క్లియర్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

మరోవైపు రెవెన్యూ శాఖకు సంబంధించి తొమ్మిది లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూర్చే సాదాబైనామాల క్రమబద్ధీకరణపై ఈ సమీక్షల్లో కీలక చర్చ జరగనుంది. ధరణి, ఇతర భూ సమస్యల వల్ల ఇబ్బంది పడుతున్న రైతులకు భరోసా కల్పించేలా భూ భారతి కార్యక్రమాన్ని పటిష్టం చేయనున్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన వారు అనర్హుల జాబితా ఎల్–3లోకి వెళ్లడంపై వచ్చిన ఫిర్యాదులను రీ–వెరిఫికేషన్ చేయాలని మంత్రి నిర్ణయించారు. జూన్ మొదటి వారానికల్లా లక్ష ఇందిరమ్మ ఇళ్లకు గృహ ప్రవేశాలు చేయించాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం.. ఈ సమీక్షల ద్వారా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించనుం ది. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ప్రజాప్రతినిధుల సూచనలే ప్రాతిపదికగా ఈ పరిష్కార మార్గాలు ఉండనున్నాయి.

# విశాఖ గ్లోబల్ సిటీగా ఎదుగుతుంది

- ఏయూ శతాబ్ది వేడుకల్లో సీఎం చంద్రబాబు




**ముద్ర అమరావతి:**

విశాఖ గ్లోబల్ సిటీగా ఎదుగుతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో జీఎం పాల్గొని ప్రసంగించారు. యూనివర్సిటీ విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించిన ఆయన, ఏయూ 100 ఏళ్ల చరిత్రను గొప్ప బ్రాండ్‌గా పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ సిటీగా అభివర్ణిస్తూ, త్వరలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి మరింత గుర్తింపు తీసుకువస్తుందని అన్నారు. ఏయూ రాష్ట్రంలోని 53 యూనివర్సిటీలకు దిక్సూచిగా నిలుస్తోందని, 57 దేశాల విద్యార్థులు ఇక్కడ చదవడం గర్వకారణమన్నారు. విద్యా, సాహిత్య రంగాల్లో ఏయూ చేసిన కృషిని కొనియాడారు. రూ.64 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, రూ.112 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. టెక్నాలజీ, డేటా సెంటర్లు, ఏఐ, క్వాంటం రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని, తన వయస్సు 76 అయినా ఆలోచనలు యువతలా ఉంటాయని చంద్రబాబు చెప్పారు.

# పార్లమెంట్ తరహాలో శాసనసభ

- సభ్యుల కోసం సెంట్రల్ హాల్, మెంబర్స్ క్లబ్
- శాసనసభ ప్రాంగణం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



**ముద్ర, హైదరాబాద్:**

పార్లమెంట్ తరహాలో శాసనసభ ప్రాంగణం తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. శాసనసభ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సభ్యుల గౌరవం పెంచేదిగా ప్రాంగణంలో అవసరమైన మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశాలు జరుగుతున్న సమయంలో సభ్యులకు ప్రైవసీ ఉండాలని చెప్పారు. గతంలో నిర్ణయించిన మేరకు పార్లమెంట్ తరహాలో సభ్యులకు సెంట్రల్ హాలును వచ్చే సమావేశాల నాటికి సిద్ధం చేయాలని అన్నరు. సభ్యుల కోసం ప్రత్యేకంగా మెంబర్స్ క్లబ్ ఒకటి ఏర్పాటు చేయాలని, ప్రస్తుత శాసనసభ, పాత మండలి భవనాల వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం జరక్కుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సభ్యుల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, క్రీడల కోసం అవసరమైన ఏర్పాట్లు ఉండాలని సూచించారు. శాసనసభ ప్రాంగణంలో భద్రతను కూడా మరింత పటిష్టం చేయాలని పలు సూచించారు.

## రాజ్యసభలో పెరిగిన బీజేపీ బలం

- బీజేపీ ఎంపీల సంఖ్య 106 నుంచి 113కు..
- ఆప్ సభ్యుల సంఖ్య 10 నుంచి 3కు తగ్గుదల

**ముద్ర, హైదరాబాద్:** రాజ్యసభలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిపి రాధాకృష్ణన్ ఆమోదంతో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు అధికారికంగా బీజేపీలో విలీనమయ్యారు. దీంతో రాజ్యసభలో బీజేపీ బలం 106 నుంచి 113కు పెరగగా, ఆప్ సభ్యుల సంఖ్య 10 నుంచి 3కు తగ్గింది.

బీజేపీలో చేరిన ఎంపీల్లో రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్ తదితరులు ఉన్నారు. ప్రస్తుతం ఆప్ తరఫున ముగ్గురు సభ్యులు మాత్రమే మిగిలారు.

ఈ పరిణామంపై స్పందించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు ఈ ఎంపీలు ఇకపై బీజేపీ పార్లమెంటరీ పార్టీ సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. ఈ మార్పులు రాజ్యసభలో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది.

## తెలంగాణలో ఇంధన కొరత లేదు..

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**ముద్ర డెస్క్:** తెలంగాణలో ఇంధన కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో తగినన్ని ఇంధన నిల్వలున్నాయని వెల్లడించింది. వదంతులను పట్టించుకోవద్దని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర విజ్ఞప్తి చేశారు.

అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టి.. ఇంధనం నిల్వ చేయడం నేరమని హెచ్చరించారు.

# మే రెండో వారంలో తెలంగాణకు ప్రధాని



**ముద్ర, హైదరాబాద్:**

మే రెండో వారంలో ప్రధానమంత్రి మోదీ తెలంగాణ పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఇదే వేదికపై నుంచి కీలక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఈ వేదిక నుంచే ప్రధాని తన ప్రసంగం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు...తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించనున్నారు. ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ నేతలు, భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన..

పరేడ్ గ్రౌండ్స్ సభ నుంచే ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలోని పలు కీలక ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ప్రధాని అధికారికంగా ప్రారంభిస్తారు. ఇది ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధికి, ఉపాధి కల్పనకు పెద్దపీట వేయనుంది. గిరిజన విద్యార్థులకు ఉన్నత చదువులను చేరువ చేసే లక్ష్యంతో ములుగులో నిర్మిస్తున్న కేంద్ర గిరిజన విశ్వ విద్యాలయానికి ప్రధాని పచ్చజెండా ఊపనున్నారు. రాష్ట్రంలోని ఏకైక ఎయిమ్స్ బీబీనగర్‌లో కొత్తగా నిర్మించిన హాస్టల్ భవనాలను ప్రధాని ప్రారంభించనున్నారు. దీనివల్ల వైద్య విద్యార్థులకు వసతి సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. మెగా టెక్స్‌టైల్ పార్కులో పూర్తయిన కీలక విభాగాలను ప్రధాని ప్రారంభించనున్నారు. అంతేకాకుండా ఖమ్మం – దేవరపల్లి మధ్య నిర్మించిన అత్యాధునిక గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ రహదారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థను వేగవంతం చేయనుంది.

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక తెలంగాణకు తొలిసారిగా మోదీ రానుండటంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ పర్యటనలో భాగంగానే... మామునూరు విమానాశ్రయానికి కూడా శంకుస్థాపన చేస్తారని సమాచారం. అయితే దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

# బిర్యానీ, పుచ్చకాయ తిని.. నలుగురి మృతి

**ముద్ర డెస్క్:** మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముంబయి లోని పైధోనీలో అబ్దుల్లా అబ్దుల్ కాదర్ (40) మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నారు. అతడి భార్య నస్రీన్ (35). వీరికి ఇద్దరు కుమార్తెలు. శనివారం రాత్రి బంధువులు నిర్వహించిన విందులో అబ్దుల్లా కుటుంబం పాల్గొని బిర్యానీ తిన్నారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పుచ్చకాయ తిన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో వారికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే అబ్దుల్లా స్థానికంగా ఉన్న డాక్టర్‌ని పిలిచారు. కానీ అప్పటికే వారి పరిస్థితి విషమంగా మారడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో నలుగురు మృతి చెందారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఫుడ్ పాయిజనింగ్ కారణం అయ్యుండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ కేంద్రంగా హైస్పీడ్ రైల్ కారిడార్ హబ్

**హైదరాబాద్ (సెక్రటేరియట్):**



భవిష్యత్ తరాలకు అనుకూలంగా రవాణా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం హైస్పీడ్ రైల్ కారిడార్లపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాన్ని దక్షిణాది రాష్ట్రాలకు కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కార్యాచరణ కొనసాగుతోంది. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైస్పీడ్ రైల్వే కారిడార్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు వ్యూహాత్మక ప్రాజెక్టుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలతో హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా హైదరాబాద్–పూణే–ముంబై కారిడార్‌కు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే పూర్తయ్యింది. చెన్నై కారిడార్ (అమరావతి మార్గం ద్వారా) మరియు బెంగళూరు కారిడార్‌పై సర్వేలు కొనసాగుతున్నాయి.

మొత్తం 761 కిలోమీటర్ల పొడవు గల హైదరాబాద్–ముంబై హైస్పీడ్ కారిడార్‌లో 12 స్టేషన్లు ప్రతిపాదించగా, అందులో 10 ఎలివేటెడ్, 2 అండర్‌గ్రౌండ్ స్టేషన్లు ఉండనున్నాయి. వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణంపై ముఖ్యమంత్రితో చర్చించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే నాన్ స్టాప్‌గా ప్రయాణం సుమారు 2 గంటల 55 నిమిషాల్లో పూర్తవుతుందని, అన్ని స్టేషన్ల వద్ద ఆగే రైలు గంటకు 330 కిలోమీటర్ల వేగంతో 3 గంటల 21 నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ–అమరావతి–చెన్నై కారిడార్‌పై కూడా ప్రత్యేకంగా చర్చించారు. ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీ–బెంగళూరు కారిడార్ రూపకల్పనపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కారిడార్లు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకంగా మారతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. 3 ట్రిలియన్ ఆర్థిక లక్ష్యాన్ని సాధించేందుకు పటిష్టమైన ఎకనామిక్ గ్రోత్ కారిడార్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ద్వారా ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఇక రాష్ట్రంలో కొనసాగుతున్న రోడ్లు, వంతెనలు, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, హైకోర్టు భవనం, టిమ్స్ ఆసుపత్రుల పనుల పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సనత్‌నగర్‌లో టిమ్స్ ఆసుపత్రిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆర్ అండ్ బి, హెచ్ఎండీఏ, హెచ్ఎంఆర్ఎల్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 28.04.2026
www.mudranews.in | @mudranews



**నేరేడి పండ్లు**

వేసవిలో శరీర వేడి తగ్గిస్తుంది. శరీరానికి చల్లదనం ఇచ్చి అలసట తగ్గిస్తుంది.



# కోపం ఖరీదు.. 20% మ్యాచ్ ఫీజు జరిమానా.!

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ యువ ఆటగాడు అంగ్‌క్రిష్ రఘువంశీ వివాదంలో చిక్కుకున్నాడు. లక్నో సూపర్ జైంట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతనిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానాతో పాటు ఒక డిమెరిట్ పాయింట్ విధించారు. ఐపీఎల్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, లెవల్-1 నిబంధనల ఉల్లంఘనకు ఈ శిక్ష విధించారు. మ్యాచ్ సందర్భంగా జరిగిన ఒక సంఘటన తర్వాత రఘువంశీ అసహనం వ్యక్తం చేస్తూ బౌండరీ వద్ద బ్యాట్‌తో బలంగా కొట్టడం వివాదానికి దారి తీసింది. ఈ ఘటన ఐదో ఓవర్‌లో చోటు చేసుకుంది. ప్రిన్స్ యాదవ్ వేసిన బంతిని ఆడిన రఘువంశీ సింగిల్ కోసం పరుగెత్తాడు. అయితే నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న కామెరాన్ గ్రీన్ అతన్ని వెనక్కి పంపాడు. తిరిగి క్రీజ్ వైపు పరుగెత్తే సమయంలో రఘువంశీ తన దిశను ఆకస్మికంగా మార్చాడు. దీంతో బంతి నేరుగా స్టంప్స్‌ను తాకకుండా అతని కాలి దగ్గరికి తగిలింది. ఈ పరిణామంపై లక్నో ఆటగాళ్లు అప్పీల్ చేయగా, టీవీ అంపైర్ రీప్లేలు పరిశీలించి రఘువంశీ ఉద్దేశపూర్వకంగా దిశ మార్చినట్లు భావించాడు. ఫలితంగా "ఆబ్స్ట్రక్టింగ్ ది ఫీల్డ్" కింద ఔట్‌గా ప్రకటించారు. ఈ నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రఘువంశీ 9 పరుగులకే తన ఇన్నింగ్స్ ముగించాల్సి వచ్చింది. మ్యాచ్ విషయానికి వస్తే, ఇరుజట్ల మధ్య పోరు ఉత్కంఠభరితంగా సాగింది. నిర్ణీత 20 ఓవర్లలో రెండు జట్లు సమంగా 155 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. అనంతరం జరిగిన సూపర్ ఓవర్‌లో లక్నో జట్టు కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసింది. కేకేఆర్ మాత్రం మొదటి బంతికే లక్ష్యాన్ని ఛేదించి ఉత్కంఠభరిత విజయాన్ని సొంతం చేసుకుంది



# కొంపముంచుతున్న క్యాచ్ డ్రాప్‌లు..

## మారిపోతున్న మ్యాచ్‌ల లెక్కలు..









**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026 సీజన్‌లో ఒక ఆశ్చర్యకరమైన ధోరణి కనిపిస్తోంది. భారీ స్కోర్లు, ఉత్కంఠభరిత పోరాటాలు, చివరి బంతి వరకు సస్పెన్స్ మధ్య మరో అంశం ప్రతి మ్యాచ్‌ను ప్రభావితం చేస్తోంది. అదే క్యాచ్ డ్రాప్‌లు. ఫీల్డర్లు జారవిడుస్తున్న సులభమైన క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాలను పూర్తిగా మార్చేస్తున్నాయి. ఈ సీజన్‌లో క్యాచ్‌లు వదిలేయడం జట్లకు పెద్ద తలనొప్పిగా మారింది. ఒక లైఫ్ ఇచ్చిన ఆటగాడు తర్వాత సెంచరీ చేయడం, మ్యాచ్‌ను ఒంటిచేత్తో గెలిపించడం వంటి ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. దీంతో ఫీల్డింగ్ లోపాలు జట్ల విజయావకాశాలను దెబ్బతీస్తున్నాయి.

**కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌కు కారణమైన డ్రాప్ క్యాచ్**

అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ దీనికి తాజా ఉదాహరణ. ఢిల్లీ జట్టు 264 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఇందులో కేఎల్ రాహుల్ 152 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, మూడో ఓవర్‌లోనే శశాంక్ సింగ్ సులభమైన క్యాచ్‌ను జారవిడవడంతో రాహుల్‌కు లైఫ్ లభించింది. ఆ తర్వాత అతడు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి భారీ స్కోరు నమోదు చేశాడు.

**శ్రేయస్ అయ్యర్ రికార్డు ఛేజ్ వెనుక కూడా అదే కారణం**

ఈ మ్యాచ్‌లో పంజాబ్ ఫీల్డర్లు మాత్రమే కాదు, ఢిల్లీ జట్టు కూడా అనేక క్యాచ్‌లు వదిలేసింది. మొత్తం ఆరు అవకాశాలను జారవిడిచినట్లు సమాచారం. 15వ ఓవర్‌లో కరుణ్ నాయర్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేయడంతో శ్రేయస్ అయ్యర్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జట్టును విజయానికి చేర్చాడు.

**పడిపోతున్న ఫీల్డింగ్ ప్రమాణాలు**

నిపుణుల ప్రకారం ఇది ఒక్కసారిగా వచ్చిన సమస్య కాదు. గణాంకాలు చూస్తే 2020లో ప్రతి 100 క్యాచ్‌లలో 85 క్యాచ్‌లు పట్టేవారు. కానీ 2025 నాటికి ఆ సంఖ్య 76కు పడిపోయింది. ప్రస్తుత సీజన్‌లో ఇది మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఒకే రోజులో 17 క్యాచ్‌లు డ్రాప్**

ఏప్రిల్ 25న జరిగిన మ్యాచ్‌ల్లో మొత్తం 17 క్యాచ్‌లు జారవిడవడం ఈ సమస్య తీవ్రతను చూపిస్తోంది. జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో కూడా సులభమైన అవకాశాలు వదిలేయడంతో 229 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడం సాధ్యమైంది.

**అలసట, బిజీ షెడ్యూల్ ప్రధాన కారణాలు**


మాజీ ఆటగాళ్లు ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా తీరికలేని క్రికెట్ క్యాలెండర్‌ను చెబుతున్నారు. ఐసీసీ టోర్నీలు, ఫ్రాంచైజీ లీగ్‌లు, ద్వైపాక్షిక సిరీస్‌ల మధ్య ఆటగాళ్లకు సరైన విశ్రాంతి దొరకడం లేదు. ఇటీవలే టీ20 వరల్డ్ కప్ ముగియడంతో చాలామంది ఆటగాళ్లు శారీరకంగా, మానసికంగా అలసిపోయి ఉన్నారని అంటున్నారు.

**తీవ్రమైన వేడి కూడా ప్రభావం**

దేశంలోని అనేక నగరాల్లో పెరుగుతున్న ఎండలు కూడా ఫీల్డింగ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఎత్తుగా వచ్చే బంతులను గమనించడం కష్టమవుతోంది. డీహైడ్రేషన్, అలసట, ఏకాగ్రత లోపం కారణంగా తప్పిదాలు పెరుగుతున్నాయి. ఇక, భారత మాజీ ఫీల్డర్ మహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ, ఫీల్డింగ్ మెరుగుపరచుకోవాలంటే నిరంతర సాధన అవసరమని అన్నారు. కానీ ప్రస్తుత షెడ్యూల్‌లో ఆటగాళ్లకు అందుకు సమయం దొరకడం లేదని స్పష్టం చేశారు.

**చిన్న తప్పిదమే పెద్ద ఫలితం**

క్యాచ్ డ్రాప్ అనేది కేవలం ఒక చిన్న తప్పిదంలా కనిపించినా, అది మ్యాచ్ ఫలితాన్ని పూర్తిగా మార్చేస్తోంది. IPL లాంటి ఒత్తిడితో కూడిన టోర్నీలో ఒక అవకాశం ఇచ్చినా ప్రత్యర్థి దాన్ని భారీగా మలుచుకుంటున్నాడు. అందుకే ఈ సీజన్‌లో క్యాచ్‌లు జారవిడవడం జట్లకు కొంపముంచే సమస్యగా మారింది.. ఎన్నో జట్లకు విజయాన్ని అందించింది.. దీంతో, ప్రత్యర్థి జట్లు చతికిలపడిపోయిన పరిస్థితి..




# సెల్ఫీ కావాలంటే రూ.100 ఇవ్వాల్సిందేనా.

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

గ్రౌండ్ లో అడుగుపెడితే ఎంత అనుభవజ్ఞుడైన బౌలరైనా సరే నాకేంటి.. కొడితే బాల్ బౌన్డర్య దాటిందా లేదా అనే వైభవ్ సూర్యవంశీ, బయట మాత్రం ఎంత సరదాగా ఉంటాడో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రస్తుత ఐపీఎల్ లో అద్భుత ఫామ్‌తో దూసుకుపోతున్న వైభవ్ సూర్యవంశీ ఈసారి తన బ్యాటింగ్ విన్యాసాలతో కాకుండా మరో అంశంతో మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇందుకు సంబంధించి ఓ సరదా ప్రాంక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విమానాశ్రయంలో ఇద్దరు చిన్నారులు అతనితో సెల్ఫీ తీసుకోవాలని అడిగిన సందర్భంలో జరిగిన ఈ సంఘటన అందరినీ ఆకట్టుకుంటోంది. విమానాశ్రయంలో కూర్చున్న సూర్యవంశీని చూసిన ఇద్దరు పిల్లలు సెల్ఫీ కోసం దగ్గరకు వచ్చారు. అయితే అందుకు సరదాగా స్పందించిన సూర్యవంశీ, "ఫోటో తీసుకోవాలనుకుంటే నేను డబ్బులు తీసుకుంటా.. ఒక ఫొటోకు రూ. 100 ఇవ్వాలి" అని అన్నాడు. దీనితో మొదట పిల్లలు కొద్దిగా ఆశ్చర్యపోయినా అతను నిజంగానే డబ్బులు అడుగుతున్నాడని భావించి ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఇక్కడ ఇంకా ఫన్ ఏంటంటే.. మేము ఇద్దరమూ ఉన్నాము రూ. 200 తీసుకొని ఇద్దరికీ ఫోటోలు ఇవ్వమని పిల్లలు అమాయకంగా అన్నారు. దీనితో వెంటనే తన ప్రాంక్‌ను బయటపెట్టిన సూర్యవంశీ, అది సరదా కోసం మాత్రమేనని చెప్పి పిల్లలతో నవ్వుతూ ఫోటోలు దిగాడు. చివరగా "కెమెరా వైపు చూడండి" అని చెప్పి క్యూట్‌గా పోజ్ ఇచ్చాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

## సూపర్ ఓవర్‌లోని రన్స్, వికెట్లను

# బ్యాట్స్‌మెన్, బౌలర్ ఖాతాలో ఎందుకు కలపరు?



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

సూపర్ ఓవర్ అనేది ఒక్కొ జట్టుకు ఆరు బంతులు మాత్రమే ఉండే హై-స్పీడ్ టై-బ్రేకర్. 20 ఓవర్ల మ్యాచ్‌లో ఫలితం తేలకపోతే క్రికెట్‌లో సూపర్ ఓవర్ నిర్వహిస్తారు. కానీ, సూపర్ ఓవర్‌లో బ్యాట్స్‌మెన్ చేసిన పరుగులు లేదా బౌలర్ తీసిన వికెట్లు వారి కెరీర్ గణాంకాల్లో జమ చేయరు. ఈ విషయం తెలిస్తే చాలా మంది ఆశ్చర్యపోతారు. దీని వెనుక తర్కబద్ధమైన కారణాలు ఉన్నాయి. దీని వెనుక ఉన్న 3 ప్రధాన కారణాలు ఇవి.

**1. మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడానికి మాత్రమే సూపర్ ఓవర్**

సూపర్ ఓవర్ అనేది 20 ఓవర్ల (లేదా 50 ఓవర్ల) మ్యాచ్‌లో భాగం కాదు. ఇది కేవలం టై అయిన మ్యాచ్‌ను ఎవరు గెలుస్తారో నిర్ణయించడానికి మాత్రమే ఆడతారు. ఐపీఎల్ 2026లో ఆదివారం రాత్రి ఎల్ఎస్జీ (లక్నో సూపర్ జెయింట్స్) vs కెకెఆర్ (కోల్‌కతా నైట్ రైడర్స్) మ్యాచ్‌లో సూపర్ ఓవర్ జరిగింది. కెకెఆర్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సునీల్ నరైన్ సూపర్ ఓవర్‌లో రెండు వికెట్లు తీయగా, రింకూ సింగ్ ఒక ఫోర్ కొట్టి విజయం అందించాడు. అయినా ఈ పరుగులు, వికెట్లు వారి కెరీర్ గణాంకాల్లో జమ కాలేదు. ఎందుకంటే ఇది మ్యాచ్ ఫలితం మాత్రమే నిర్ణయించే టై-బ్రేకర్, మ్యాచ్‌లో భాగం కాదు.

**2. ఫుట్‌బాల్‌లోని టై-బ్రేకర్ నియమం క్రికెట్‌కు కూడా వర్తిస్తుంది**

ఫుట్‌బాల్‌లో మ్యాచ్ డ్రా అయితే పెనాల్టీ షూట్‌అవుట్ (టై-బ్రేకర్) జరుగుతుంది. ఆ గోల్స్ ఆటగాళ్ల వ్యక్తిగత గణాంకాల్లో జమ కావు. అదే విధంగా క్రికెట్‌లోనూ సూపర్ ఓవర్ టై-బ్రేకర్ మాత్రమే. ఇందులో ఒక్క బౌలర్ మాత్రమే బౌలింగ్ చేస్తాడు, ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లు మాత్రమే బ్యాటింగ్ చేస్తారు. మిగిలిన ఆటగాళ్లకు అవకాశం రాదు. ఇలాంటి పరిస్థితిలో సూపర్ ఓవర్ గణాంకాలను కలిపితే ఆటగాళ్ల మధ్య వివక్ష ఏర్పడుతుంది. అందుకే ఈ నియమాన్ని అమలు చేస్తారు. ఇది ఆటగాళ్లకు సమానత్వం కాపాడుతుంది.

**3. క్రికెట్ నియమాలలో ఏకరూపతను పాటించడం**

టీ20లో ఒక బౌలర్‌కు గరిష్టంగా 4 ఓవర్లు, వన్డేలో 10 ఓవర్లు మాత్రమే వేయవచ్చు. సూపర్ ఓవర్ గణాంకాలను కలిపితే ఒక బౌలర్ టీ20లో 5 ఓవర్లు, వన్డేలో 11 ఓవర్లు అవుతాయి. ఇది నిబంధనలను ఉల్లంఘించడం అవుతుంది. అందుకే సూపర్ ఓవర్‌ను ప్రత్యేకంగా ఉంచి, దాని గణాంకాలను లెక్కించరు. ఇది అన్ని ఫార్మాట్లలో నియమాల ఏకరూపతను కాపాడుతుంది. భవిష్యత్తులో ఎప్పుడైనా సూపర్ ఓవర్ జరిగినా, ఎన్ని పరుగులు చేసినా లేదా ఎన్ని వికెట్లు తీసినా అవి ఆటగాళ్ల వ్యక్తిగత రికార్డుల్లో జమ కావు. ఇది క్రికెట్ నియమాల్లో స్పష్టంగా ఉంది.

# చెత్త రికార్డు మూటగట్టుకున్న ఎల్ఎస్‌జీ..

## ఓటమి తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్ ఆవేదన..!

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



పీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ (LSG) దారుణ ప్రదర్శన కొనసాగుతోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR)తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సూపర్ ఓవర్ వరకు పోరాడిన ఎల్ఎస్‌జీ చివరికి ఓటమి చవిచూసింది. ఈ పరాజయంతో వరుసగా ఐదో ఓటమిని నమోదు చేసుకున్న లక్నో జట్టు, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కేకేఆర్ ఒక దశలో 93/7తో తీవ్ర కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులో నిలిచిన రింకు సింగ్ అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టును ఆదుకున్నాడు. కేవలం 51 బంతుల్లో 83 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. రింకు ధాటికి కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 155/7 స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో ఎల్ఎస్‌జీ బ్యాటింగ్ కూడా ఒత్తిడికి లోనైంది. వికెట్లు కోల్పోతూ మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లింది. చివరి బంతికి మహమ్మద్ షమీ కొట్టిన సిక్సర్‌తో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లింది. అయితే అక్కడ ఎల్ఎస్‌జీ పూర్తిగా కుప్పకూలింది. ఇక, సూపర్ ఓవర్‌లో లక్నో జట్టు ఒక వికెట్ కోల్పోయి కేవలం 2 పరుగులు మాత్రమే చేసింది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యల్ప సూపర్ ఓవర్ స్కోర్లలో ఒకటిగా నిలిచింది. తర్వాత కేకేఆర్ సులభంగా లక్ష్యాన్ని చేరుకొని విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక, మ్యాచ్ అనంతరం మాట్లాడిన ఎల్ఎస్‌జీ కెప్టెన్ రిషబ్ పంత్ జట్టు పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశాడు. "మాకు విరామం అవసరం. ప్రతి మ్యాచ్‌లో ఒత్తిడి ఉంటుంది. బయట కారణాలు వెతకకుండా, మనలోనే పరిష్కారాలు కనుగొనాలి. ప్రతి ఆటగాడు బాధ్యత తీసుకోవాలి. ఇది ఒక్కరిద్దరి ఆట కాదు" అని వ్యాఖ్యానించాడు. సూపర్ ఓవర్‌లో నికోలస్ పూరన్‌ను పంపిన నిర్ణయాన్ని కూడా పంత్ సమర్థించాడు. "అతను ప్రస్తుతం ఫామ్‌లో లేకపోయినా, కష్ట సమయాల్లో మన ఆటగాళ్లను నమ్మాలి" అని తెలిపాడు. మరోవైపు.. కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే మాత్రం రింకు సింగ్ ఇన్నింగ్స్‌ను మ్యాచ్ టర్నింగ్ పాయింట్‌గా పేర్కొన్నాడు. "16 ఓవర్ల తర్వాత మేము ఆడిన తీరు, ముఖ్యంగా రింకు ఇన్నింగ్స్ మ్యాచ్ గమనాన్ని మార్చేసింది. ఒక్క వికెట్ కూడా ఆటను మలుపు తిప్పగలదని మాకు తెలుసు" అని అన్నాడు. అలాగే బౌలర్లు సునీల్ నరైన్, కార్తిక్ త్యాగి, వైభవ్ అరోరా అద్భుతంగా బౌలింగ్ చేశారని ప్రశంసించాడు. మ్యాచ్ హీరో రింకు సింగ్ మాట్లాడుతూ, "నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు అప్పటికే నాలుగు వికెట్లు పడిపోయాయి. చివరి వరకు నిలబడి, వదులుగా వచ్చే బంతులను బౌండరీకి పంపాలని భావించాను" అని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో 83 పరుగులతో పాటు నాలుగు క్యాచ్‌లు పట్టిన రింకు సింగ్, సూపర్ ఓవర్‌లో విజయపు షాట్ కొట్టి అసలైన హీరోగా నిలిచాడు. మరోవైపు ఎల్ఎస్‌జీ మాత్రం చెత్త రికార్డు మూటగట్టుకుని అభిమానులను నిరాశపరిచింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 28.04.2026
www.mudranews.in | @mudranews



**నేరేడు పండ్లు :** తాజాగానే తినడం ఉత్తమం.. చెట్టు నుంచి కొత్తగా తీసిన పండ్లలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయి.



# శరవేగంగా కల్కి-2 షూటింగ్

**తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం**

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో షూటింగ్‌లో చేరనున్నారని సమాచారం.ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.






# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్

**సాయిపల్లవి కాదు కాదు.. రుక్మిణీ వసంత్**



జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సరో త సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.





# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

**దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి**

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సరో తం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేకో తాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.






# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com